# నీలి నీడలు

ఉదయం నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వర్షం. రాజశేఖరం వేసుకున్న ప్లానంతా తల్లక్రిందులైంది వర్షం వల్ల. హైదరాబాద్‌లో ఎం.ఏ. చదువుతున్న రాజశేఖరం పరీక్షలైన వెంటనే ఆరోజు ఉదయమే హైదరాబాద్ నుంచి తిరిగి తన స్వగ్రామం వచ్చేడు.

పద్మకు ఈ వర్షం మంచి ఉత్సాహం కల్గించింది. ఆరోజంతా తన బావ రాజశేఖరంతో సంతోషంగా కబుర్లు చెప్తూ గడిపింది.

రాత్రి పదకొండు గంటలైంది. రాజశేఖరం చదువుతున్న పుస్తకాన్ని టేబిల్ మీద వుంచి లైట్ ఆఫ్ చేసాడు. గదంతా చీకటి అలుముకుంది. బయట వర్షం యింకా జోరుగా కురుస్తోంది. కన్నులు మిరుమిట్లు గొల్పే మెరుపులతోను చెవులు చిల్లులు పడే ఉరుములతోను ఆకాశమంతా భీకరంగా వుంది.

కిటికీ చువ్వల మీద నిలబడి ఏదో పక్షి వికృతంగా కూసింది. ఆ పక్షి కూతకి రాజశేఖరం అదిరిపడ్డాడు. చీకటిలో అస్పష్టంగా కన్పిస్తున్న ఆ పక్షి రూపాన్ని చూడాలని కుతూహలం కలిగింది. టేబిల్ లైటు స్విచ్ నొక్కాడు. మరుక్షణంలో ఆ పక్షి మళ్లీ వికృతంగా కూస్తూ అంధకారంలో మాయమైంది.

వానజల్లు కొద్ది కొద్దిగా వచ్చి కిటికీలోంచి గదిలో పడుతోంది. గదిలో పరుపు కొంతమేర తడిసి చల్లగా వుంది.

రాజశేఖరం లేచి వెళ్ళి కిటికీ తలుపు వేయబోయాడు. పెద్ద జల్లు వచ్చి అతని ముఖమంతా తడిపింది. కిటికీ తలుపులు మూసి వెను తిరిగేసరికి ఆ నిశీధిలో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వస్తున్న స్త్రీ రోదన వినిపించింది. వెనువెంటనే మరి రెండు మూడు స్త్రీ కంఠాలు కూడ శృతి కలిపాయి.

హృదయ విదారకంగా వున్న ఆ రోదన వినగానే రాజశేఖరం గుండె కలుక్కుమంది.

"చంద్రయ్యా! చంద్రయ్యా!" అంటూ మెట్ల మీద నిలబడి బిగ్గరగా పిలిచాడు.

అతని కేకలు విని ప్రక్కగదిలోంచి పద్మ, ఎదురుగదిలోంచి పద్మ తల్లి శేషమ్మగారు ఒకేమారు బయటకు వచ్చేరు.

"ఏం బావా? ఏం జరిగింది!" అంటూ ఆతృతగా అడిగింది పద్మ.

"ఆఁ! ఏం లేదు బయట....."

"బాబూ పిల్చారా?" అంటూ చంద్రయ్య కళ్లు నులుపుకుంటూ మేడమెట్లెక్కి వచ్చాడు.

"నిద్రపోతున్నావా?"

"నేదు బాబూ! తవరు నైటు ఆర్వాక యిలా నడుం వాల్చేను. మీ పిలుపు యిని పారొచ్చేను"

"బయట ఏమిటా గొడవ!"

"సూసొస్తా బాబయ్యా" అంటూ గొడుగు తీసుకొని బయటకు వెళ్ళి పది నిముషాల్లో తిరిగొచ్చేడు.

"గోరం బాబయ్యా! గోరం జరిగిపోనాది. మన రాంబాబుగారు నేరండీ ఆరి బావగోరు పోయారండి" అన్నాడు విచారంగా.

"ఆ! ఎవరూ? మంజుల భర్తా!" రాజశేఖరం అదిరిపడ్డాడు.

"అవును బాబూ ఆరే. గుండెనొప్పి వొచ్చిందిట వెంటనే కొట్టేసింది"

రాజశేఖరానికి క్షణకాలం నోటంట మాటరాక అలానే నిల్చుండిపోయాడు. అప్రయత్నంగా అతని కళ్లు చెమ్మగిల్లాయి.

"చంద్రయ్యా! నా రైన్‌కోటు ఎక్కడుందో తెచ్చిపెట్టు" అంటూ గదిలోకి వెళ్ళేడు.

"హే భగవాన్! ఏమిటి నీకింత పగ రామంపైన? చెల్లెలి పెళ్ళిచేసి పట్టుమని ఆరునెలలైనా కాలేదు. ఏమిటో ఘోరం!" అనుకున్నాడు.

"ఇంత వర్షంలో వెళ్తావా బావా!" అంది పద్మ ఆశ్చర్యంగా.

"అవును పద్మా, నువ్వు కూడా రాకూడదూ? మంజులకు కాస్త ధైర్యం చెప్పడానికి"

"నేనా!" అంది పద్మ భయంగా.

"పోనీ ఉదయం వెళ్ళకూడదూ? రాజా! ఇంత రాత్రప్పుడు వర్షంలో వెళ్ళి చేయవల్సిందేం లేదుకదా! అంతగా కావలిస్తే మన చంద్రయ్యను పంపుదాం" అన్నారు శేషమ్మగారు.

రాజశేఖరం అందుకు అంగీకరించలేదు. తను తక్షణం వెళ్ల నిశ్చయించుకున్నాడు. చంద్రయ్య తెచ్చిన రైన్‌కోటు వేసుకొని టార్చిలైట్ తీసికొని రామం ఇంటికి బయలుదేరేడు. చంద్రయ్య గొడుగు తీసుకొని రాజశేఖరం వెంట నడిచేడు. పద్మ, శేషమ్మగారు వారు వెళ్ళినవేపు చూస్తూ నిల్చుండిపోయేరు.

రామం యిల్లు రాజశేఖరం యింటి వెనుక వీధిలోనే వుంది.

రాజశేఖరం తండ్రి శివరామయ్యగారు, రామం తండ్రి జగన్నాథంగారు మంచి స్నేహితులు. శివరామయ్యగారు ఎంత చిన్న విషయమైనా జగన్నాథంగారితో ముచ్చటించందే వుండేవారు కాదు. జగన్నాథంగారి సలహా లేందే ఏ పనీ చేసేవారు కాదు. జగన్నాథంగారి మాటంటే శివరామయ్యగారికి వేదవాక్కు.

జగన్నాథంగారు శివరామయ్యగారంత స్థితిపరులు కాకపోయినా తన కష్టార్జితంతో పదెకరాల పల్లంభూమి సంపాదించి మంచి యిల్లొకటి కట్టించేరు. శివరామయ్యగారికి ఎలా లేదన్నా 50 వేలు చేసే స్థిరాస్తి వుంది. శివరామయ్యగార్కి రాజశేఖరం ఒక్కడే కొడుకు. జగన్నాథంగార్కి రామం, మంజుల ఇద్దరు పిల్లలు. శివరామయ్య, జగన్నాథం గార్లవలె వారి పిల్లలు కూడా మంచి స్నేహితులు. రామం, రాజశేఖరం యించుమించు ఒకే యీడువారు. మంజుల రామం కన్నా మూడేళ్లు చిన్న.

రామం బి.యస్.సి. ఫైనలియర్ చదువుతూండగా జగన్నాథంగారు పోయేరు. రామం తల్లి మంజుల పుట్టగానే పోయింది. బి.యస్.సి.తో తన చదువుకు వుద్వాసన చెప్పి వ్యవసాయరంగంలోకి దిగేడు. చెల్లెలు మంజులకు ఏ లోటూ రాకుండా చూస్తూ స్కూలు ఫైనలు వరకూ చదువు చెప్పించేడు. తన తాహతుకు మించినదైనా మంచి సంబంధం చూసి మంజుల పెళ్లి చేసేడు రామం.

శివరామయ్యగారు స్నేహితుడి మరణవార్త విని ఎన్నో రోజులు జీవించలేకపోయారు. రాజశేఖరం ఎం.ఏ. మొదటి సం॥ చదువుతూండగా అతని తల్లి పోయింది.

★ ★ ★

అక్కడ పనంతా పూర్తయి ఇంటికి వచ్చేసరికి మర్నాడు మధ్యాహ్నం రెండు గంటలైంది. రాత్రి పద్మ తనతో రానందుకు రాజశేఖరం అంతగా పట్టించుకోకపోయినా మర్నాడుదయం శేషమ్మగారు కాని, పద్మకాని రామం ఇంటికి వెళ్ళకపోవడం రాజశేఖరానికి నచ్చలేదు. ఇంటికి రాగానే పద్మతో యీ విషయయే అన్నాడు. ఆ పన్నెండు రోజులూ రాజశేఖరం యించుమించు రామం ఇంటి దగ్గరే వుంటూ రామాన్ని మంజులను ఎన్నో విధాల ఊరడించి ఎంతో సహాయపడ్డాడు.

రాజశేఖరం ఒకనాడు సాయంత్రం తోట చూద్దామని బయల్దేరేడు పద్మతో శివరామయ్యగారు దగ్గరుండి వేయించిన తోటది. రెండువందల అంటుమామిడి మొక్కలు, అరవంద సపోటాచెట్లు, వంద బత్తాయి చెట్లు నాటించేరు. గత మూడేళ్ళ నుండి తోట కాపు పట్టింది. సంవత్సరానికి ఎలా లేదన్నా ఖర్చులు పోను పదివేలు వరకూ లాభం వస్తోంది.

ఊరికి అరమైలు దూరంలో ప్రవహిస్తున్న ఏటిని ఆనుకొని వుంది తోట. వీరయ్య వారికి తోటలో ఎదురు వచ్చేడు. "దండాలు చినబాబూ!" అంటూ.

"ఏం వీరయ్యా! ఈ ఏడు కాపెలా వుంది?"

"మామిడి, సపోటా రూపాయకు పదారణాలు కాపుందండి. మరి బొత్తాయి బాగానే వుందండి" అన్నాడు.

"నీ కూతురు నాగి కనుపించదేం?" అంది పద్మ.

"మరి బైసుకోపు కెళ్లిందండి"

రాజశేఖరం, పద్మ తోటలో చాలాసేపు తిరిగి మొక్కలన్నీ చూసేరు. వారుంటికి బయలుదేరుతూంటే వీరయ్య ఒక బుట్టలో ఆరముగ్గిన సపోటా పళ్లు పెట్టి వారి వెంట బయలుదేరేడు. తోట సంరక్షణంతా వీరయ్యదే. చంద్రయ్య, వీరయ్య ఇద్దరూ అన్నదమ్ములు. వీరయ్య జగన్నాధంగారింట పాలేరుగా వుండేవాడు. శివరామయ్యగారు తోట వేసేక అతని తోట వీరయ్య కప్పగించేరు. తోట కాపు పట్టగానే వీరయ్య తన భార్య కూతురుతో వచ్చి తోటలోనే కాపురం వుంటూ తోటపని చూస్తున్నారు.

త్రోవలో వారికి రామం కలిసేడు.

'తోటవేపు వెళ్ళేరా?" అని ప్రశ్నించేడు.

"అవును రామం, నీకోసం కబురు పెట్టేను. నువ్వు పొలానికి వెళ్ళేవన్నారు. అలా చల్లగాలికి తిరిగొస్తున్నాం. చూడు వీరయ్యా! ఆ పళ్ళబుట్ట రామం యింట్లో యిచ్చి నువ్వెళ్ళిపో" అన్నాడు రాజశేఖరం.

"అన్ని పళ్లు నేనేం చేసుకోను రాజూ!" అన్నాడు రామం.

"ఆఁ! ఎన్నో లేవులే వుండనీ" అన్నాడు రాజశేఖరం చిరునవ్వుతో.

వాళ్లు ఇంటికొచ్చేసరికి చంద్రయ్య రాజశేఖరానికో టెలిగ్రాం తెచ్చి యిచ్చేడు. "ఇప్పుడే వచ్చింది బాబూ" అంటూ.

మంగళవారం ఉదయం ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నట్లు స్టేషన్‌కి వచ్చి తనను రిసీవ్ చేసుకోమని రోజా పంపిన మెసేజి అది.

రాజశేఖరం చదివి పద్మకిచ్చేడు.

"ఎవరు బావా ఈ రోజా!" అంది పద్మ ఆశ్చర్యంగా.

"మా ఫ్రెండులే!" అంటూ హుషారుగా ఈలవేస్తూ మేడ మీదకు వెళ్ళాడు.

## 2

కాలేజీ లైబ్రరీలో రాజశేఖరానికి ఆరోజు కొంచెం లేటైంది. తొందరగా వచ్చి బస్‌స్టాప్‌లో నిల్చున్నాడు. అతని కన్నా ముందు వచ్చి యింకో అమ్మాయి బస్సుకోసం వెయిట్‌చేస్తున్నది. రాజశేఖరం ఒకమారు ఆ అమ్మాయిని చూసేడు. శరీరాన్ని అంటుకుపోయే పంజాబీ దుస్తులతో వుందామె. రెండు బస్సులు క్రిక్కిరిసిన జనంతో వచ్చి ఆగకుండా వెళ్లిపోయేయి.

రాజశేఖరాన్ని ఆ అమ్మాయి నాలుగైదు మార్లు ఆపాదమస్తకం చూసింది. పది నిముషాల్లో ఓ కారు వచ్చి ఆ అమ్మాయి ముందు ఆగింది. డ్రైవరు వెనుక సీటు తలుపు తెరిచి నిల్చున్నాడు.

"ఇంత లేటైందేం?" అంటూ గద్దించింది చేతిలో వున్న పుస్తకాలు బాక్ సీట్లో పడేస్తూ.

"ఇంజను ట్రబులిస్తే వర్క్‌షాపులో చూపించి వస్తున్నా" అన్నాడు వినయంగా.

"మిస్టర్ మీరు ఎక్కడికి వెళ్లాలి?" అంటూ నవ్వుతూ ఇంగ్లీషులో ప్రశ్నించింది రాజశేఖరాన్ని.

రాజశేఖరం చెప్పేడు.

"మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తారండి" అంటూ ఆహ్వానించింది.

"ఎందుకండీ బస్సు వచ్చేస్తుంది కదా!" అన్నాడు రాజశేఖరం జంకుతూ.

"మా ఇల్లు కూడా అటే ఫర్వాలేదు రండి" అంది.

రాజశేఖరం కాదనలేకపోయాడు. అతను ఆమెను ఇదివరకెన్నడూ చూళ్లేదు.

తన పేరు 'రోజారాణి' అని తను బి.యస్.సి. ఫస్టియరు చదువుతున్నాని ఆ అమ్మాయి తనను తాను యింట్రడ్యూస్ చేసుకుంది. రాజశేఖరం కూడ ఆమెకు తన సంగతి చెప్పేడు.

తన రూం దగ్గర కారు ఆగిన వెంటనే రాజశేఖరం ఆమెకు "థాంక్స్" చెప్పి రూమ్‌కి బయలుదేరేడు. తాళం తీసి గడియ తీస్తుంటే–

"మీరు సింగిల్‌గా వుంటున్నారా?" అన్న రోజా మాటలకు వెనుతిరిగి చూసాడు.

"అవునండీ, రండి" అంటూ తలుపులు పూర్తిగా తెరిచేడు.

"మీరు నన్ను ఇన్వైట్ చెయ్యకపోయినా నేనే వచ్చాను మీ రూం చూద్దామని" అంది రోజా నవ్వుతూ.

"లేదండీ మీకు లేటౌతుందని పిలవలేదు సారీ! కూర్చోండి" అంటూ ఫేను వేసేడు.

"వన్‌మినిట్" అని రాజశేఖరం లోనికి వెళ్లాడు.

రోజా గదంతా ఒకమారు చూసింది. వస్తువులన్నీ చాలా నీట్‌గా ఎరేంజి చేసి వున్నాయి. టేబిల్ ప్రక్కనున్న షెల్ఫ్‌లో చాలా పుస్తకాలున్నాయి. రెండు మూడు పుస్తకాలు తీసి పేజీలు త్రిప్పి మళ్లీ వాటిని యథాస్థానంలో వుంచింది.

రాజశేఖరం రెండు కప్పులతో టి తీసుకొచ్చి ఒకటి ఆమెకిచ్చేడు. బిస్కట్ల టిన్ను తెరచి టిపాయ్ మీద వుంచాడు.

రోజా నాలుగు బిస్కట్సు తిని టీ త్రాగింది.

"టి అద్భుతంగా వుంది! రోజూ ఈవినింగ్ టీకి మీ యింటికొచ్చేస్తాను" అంది నవ్వుతూ.

"యూ ఆర్ ఆల్‌వేస్ వెల్‌కమ్" అన్నాడు రాజశేఖరం కూడా నవ్వుతూ.

"రేపుదయం పది గంటలకు వస్తా, కాలేజీకి వెళ్ళడానికి మీరూ రడీగా వుంటారుగా" అంది రోజా.

రాజశేఖరం ఏదో చెప్పాలనుకుని మళ్లీ వూరుకున్నాడు.

"గుడ్‌నైట్!" అంటూ రోజా వయ్యారంగా నడుస్తూ వెళ్లిపోయింది. ఆమె పిరుదులపై విలాసంగా నాట్యం చేస్తున్న ఆమె వాలుజడను చూస్తూ గుమ్మంలో నిల్చున్నాడు రాజశేఖరం.

"గుడ్మార్నింగ్! మిస్టర్ రాజా! మీరింకా రడీ కాలేదూ?" అంటూ సుడిగాల్లా ప్రవేశించింది రోజా మర్నాడుదయం.

అన్న టైమ్‌కి ఠంచన్‌గా వచ్చిన రోజాను చూసి విస్తుపోయాడు రాజశేఖరం. ఏదో మాట వరసకు అంది కాని నిజంగా వస్తుందనుకోలేదు.

"వన్‌మినిట్! షూ వేసుకొని వచ్చేస్తా!" అన్నాడు రాజశేఖరం చిరునవ్వుతో రోజాని ఆపాదమస్తకం ఒకమారు చూసి.

రాజశేఖరం చూపులకు తట్టుకోలేక రోజా సిగ్గుతో తలవంచుకుంది.

"డాడీ అవతల మనకోసం కార్లో వెయిట్ చేస్తున్నారు" అంది.

"అరే! మరి చెప్పలేదేం! లోపలకు తీసుకురాలేకపోయారా?" అంటూ పుస్తకాలు తీసుకొని బయల్దేరేడు.

బయట తలుపుకు తాళం పెట్టాలని పుస్తకాలు కింద పెట్టబోతే రోజా అందుకొని పట్టుకుంది.

రాజశేఖరం రూం తాళం వేసి బయలుదేరేడు.

"మీట్ మై డాడీ- యితను రాజశేఖరం" అంటూ కారు దగ్గర నిల్చుని సిగరెట్ కాలుస్తున్న అతన్ని రాజశేఖరానికి పరిచయం చేసింది.

"గ్లాడ్ టు మీట్ యూ!" అంటూ రాజశేఖరం షేకేండు చేసేడు.

రోజా కారు స్టార్ట్ చేసింది.

తన పేరు ముకుందరావని పైలెట్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైరయ్యానని అతను మాటల సందర్భంలో చెప్పేరు.

రాత్రి డిన్నరుకి తప్పకుండా రమ్మని రాజశేఖరాన్ని ఇన్వైట్ చేసేరు ముకుందరావుగారు.

రాజశేఖరం కాదనలేకపోయాడు.

తను అర్జంటు పనిమీద వెళ్తున్నాని సాయంత్రము వచ్చేటప్పుడు యిద్దర్నీ టాక్సీలో వచ్చేయమని చెప్పి వెళ్లిపోయారు ముకుందరావుగారు.

"మీకోసం సాయంత్రం బస్‌స్టాప్‌లో వెయిట్ చేస్తాను, త్వరగా వచ్చేస్తారు కదూ?" అంటూ రోజా చకచకా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

రాజశేఖరానికిదంతా అయోమయంగా వుంది. ఒకమూల కడుపులో ఆకలి దంచేస్తున్నది. బోయ్ వుదయం తెచ్చిన కారియర్ ఇంటి దగ్గర అలాగే వుంది. ఫస్టవర్ లీజర్ కదా కొంచెం లేటుగా తిందామనుకున్నాడు. కాని రోజా రావడంతో ఆ సంగతే మర్చిపోయి వెంటనే బయల్దేరాడు. నేరుగా కేంటీన్‌కి వెళ్లి భోజనం చేసాడు.

ఏమైనా సాయంత్రం రోజా గురించి తను వెయిట్ చెయ్యకూడదనుకున్నాడు. లాస్టవరు ప్రొఫెసర్ రాకపోవడం వల్ల మూడు గంటలకే బయల్దేరి చక్కా రూంకి వచ్చేసాడు రాజశేఖరం.

సాయంత్రం ఐదు గంటలైంది. రోజా షూ టకటక చప్పుడూ చేస్తూ విసురుగా వచ్చింది.

"హల్లో గుడ్ యీవినింగ్ రోజా!" అన్నాడు నవ్వుతూ.

"ఇష్టం లేకుంటే చెప్పేయకూడదూ? డిసీవ్ చెయ్యడమెందుకూ! మీకోసం యింతవరకూ వెయిట్ చేసి వస్తున్నా" అంది కోపంగా.

"నో! నో!! అటువంటిదేం లేదు, మాకు లాస్టవరు లీజర్. ప్రొఫెసర్ రాలేదు అందుకని త్వరగా వచ్చేశాను. వెరీ సారీ!"

"ఇదుగో మీ టీ రడీగా వుంది. తీసుకోండి" అంటూ ఫ్లాస్కులో టీ రెండు కప్పుల్లో పోసి ఒకటి ఆమెకిచ్చి తనొకటి తీసుకున్నాడు.

టీ చూడగానే రోజా కోపమంతా మాయమైంది. టీ త్రాగి కాళీ కప్పు టేబిల్ మీద వుంచింది.

"బయట టాక్సీ మనకోసం వెయిట్ చేస్తోంది. ఇంక బయల్దేరుదామా?" అంది రోజా.

"ఓకే నేను రడీగానే వున్నాను" అంటూ రాజశేఖరం రోజాతో బయల్దేరేడు.

రోజా ఇంటి ముందు టాక్సీ ఆగగానే రాజశేఖరం మీటరు చూసి పర్సు జేబులోంచి తీసేడు.

రాజశేఖరం చేతిలో పర్సు చటుక్కున తీసుకుంది రోజా నవ్వుతూ తన పర్సు తెరచి మీటరు ఛార్జీపైన ఒక రూపాయి అదనంగా యిచ్చి "కాఫీ త్రాగు" అంది. టాక్సీ డ్రైవర్ వారిద్దరికి సెల్యూట్ చేసి వెళ్లిపోయేడు.

"నేను మిమ్మల్ని ఇన్వైట్ చేస్తే మీరు 'పే' చేద్దామనుకున్నారా?" అంది చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ఎవరిస్తేనేం!" అన్నాడు నవ్వుతూ.

"అందుకనే నేను 'పే' చేసేను" అంది రాజశేఖరం పర్సు అతని షర్ట్ జేబులో పడేస్తూ.

కాంపౌండు గేటుపైన వున్న బోగన్‌విల్లాలు సంధ్యా వాయువుకు మెల్లగా కదుల్తూ వార్ని ఆహ్వానిస్తున్నట్లున్నాయి.

గేటు దాటగానే విశాలమైన కాళీ స్థలం ఇరుప్రక్కల చక్కటిలాను, రకరకాల పూలమొక్కలున్నాయి. ఒకప్రక్క లాన్‌లో షటిల్‌కాక్ కోర్టు వుంది. అందంగా వున్న ఓ గులాబీ పువ్వు త్రెంచబోయేడు. గులాబీ ముల్లు గుచ్చుకుంది.

"అబ్బా!" అంటూ చేయి విదలించేడు. ఎర్రగా రక్తం చిమ్మింది.

"ఏం జరిగింది?" అంది రోజా వెనుతిరిగి.

"అబ్బే ఏం లేదు" రుమాలుతో అదిమి పట్టేడు.

"కమాన్ రాజూ!" అటూ ముకుందరావుగారు రాజశేఖరానికి షేక్‌హేండిచ్చి రిసీవ్ చేసుకున్నారు.

"ఇంత లేటయిందేం అమ్మా?" అని కూతుర్ని అడిగేరు.

రోజా ఒక్కమారు రాజశేఖరం వేపు చూసింది. "టాక్సీ దొరకలేదు డాడీ" అంది.

"నా మిసెస్ సుమిత్ర, ఇతను రాజశేఖరం ఎం.ఏ., ఫైనలియరు చదువుతున్నారు.

డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చుని స్వెట్టర్ అల్లుతున్న తన శ్రీమతిని రాజశేఖరానికి ఇంట్రడ్యూస్ చేసేరు ముకుందరావుగారు.

"నమస్తే" అన్నాడు రాజశేఖరం.

"కూర్చోబాబూ" అన్నారావిడ.

"రాజా మీరు డాడీతో మాట్లాడుతూండండి. నేనిప్పుడే వస్తాను" అంటూ మేడ మీదకు వెళ్ళింది.

రాజశేఖరం ఒకమారు సుమిత్రగార్ని ఆపాదమస్తకం చూసేడు.

తల్లీకూతుళ్ళది ఒకే పోలిక. ఇద్దరూ తల్లీకూతుళ్ళలా కాక అక్కాచెల్లెళ్ళలాగ వుంటారు.

రోజా డ్రస్సు మార్చుకొని వచ్చేసరికి బోయ్ వారి నల్గురికీ కాఫీ టిఫెన్సు తెచ్చేడు.

"మమ్మీ! రాజా టీ ఎంత అద్భుతంగా చేస్తారనుకున్నావ్!" అంది నవ్వుతూ.

"రోజా! డోన్ట్ బి టూ సిల్లీ!" అంటూ కూతుర్ని సుమిత్రగారు గదమాయించేసరికి రోజా బుంగమూతి పెట్టింది.

"అమ్మాయి! రాజాకు మనిల్లు చూపించు" అన్నారు ముకుందరావుగారు కాఫీ టిఫెను పూర్తవగానే.

రాజశేఖరానికి రోజా తమ యిల్లు చూపించింది. ఇల్లు చాలా పెద్దదే. మేడ మీద క్రిందా అంతా కల్సి సుమారు 15 గదులుపైనే వున్నాయి. గోడలన్నీ లైట్ గ్రీన్‌కలర్ పెయింటు చేయబడి వున్నాయి. అంత పెద్ద ఇంట్లో ముగ్గురే వుంటున్నారని విని ఆశ్చర్యపోయేడు.

"డాడీ షటిల్‌కాక్ డబుల్స్ ఆడదాం రండి" అంటూ బోయ్‌ని పిల్చి నెట్ కట్టమంది. బోయ్ నెట్ బాట్స్ తీసుకొని వెళ్ళేడు.

"డాడీ మీరు మమ్మీ ఓ పార్టీ, నేనూ రాజా ఓ పార్టీ" అంది.

"అంటే ముసలి వాళ్ళని త్వరగా ఓడించొచ్చనా" అన్నారు చిరునవ్వుతూ ముకుందరావుగారు.

"మరెలా? పోనీ మమ్మీ రాజా ఓ పార్టీ, డాడీ నేనూ ఓ పార్టీ. ఏం రాజా సరేనా?"

రాజశేఖరం 'ఓకే' అన్నాడు.

సుమిత్రగార్కి కొంచమైన శ్రమకల్గనీయకుండా రెండు కోర్టులూ తనే కవర్ చేస్తూ రెండు నిల్ గేమ్సు కొట్టేడు.

రోజా షటిల్‌కాక్ బాగానే ఆడుతుంది. కాని రాజశేఖరం ముందు ఎందుకూ పనికిరాలేదు. రాజశేఖరం ఆటలో నైపుణ్యం మెచ్చుకున్నారు ముకుందరావుగారు.

"డాడీ మనం చిత్తుగా ఓడిపోయాం!" అంది రోజా విచారంగా.

"రాజా స్టేట్ ప్లేయరమ్మా! నాకిప్పుడే జ్ఞాపకం వచ్చింది. ఆమధ్య పేపర్లో కూడా యితని ఫోటో చూసా"

"ఈజిట్! మరి నాకు చెప్పలేదేం రాజా?" అంది ఆశ్చర్యంగా.

రాజశేఖరం చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

రాత్రి డిన్నరయిం తర్వాత రాజశేఖరం తన రూమ్‌కి వచ్చేడు.

ప్రతిరోజూ సాయంత్రం రోజా తను కాలేజీ నుంచి తిరిగి వస్తున్నప్పుడు రాజశేఖరం రూంకి వచ్చి అతన్ని తనతో కూడ వాళ్ళింటికి రమ్మని బలవంతంగా తీసుకెళ్తున్నది.

రోజా తల్లిదండ్రులు కూడా రాజశేఖరాన్నెంతో ఆప్యాయతతో చూస్తున్నారు. రాజశేఖరానికి రోజా స్నేహం, ముకుందరావుగారు సుమిత్రగార్ల ఆదరాభిమానాలు ఒక్కొక్కప్పుడు చాలా ఇబ్బంది కల్గిస్తున్నాయి.

సాయంత్రం ఆరు గంటలకు రోజా వాళ్ళింటికి వెళ్తే రాత్రి పది గంటలకు కాని తిరిగి తన రూంకి చేరుకోలేకపోతున్నాడు. రాత్రి డిన్నరు తీసుకోందే వెళ్ళనియ్యటంలేదు సుమిత్రగారు. పది గంటలకు రూంకి వచ్చి ఇంక ఎంతోసేపు చదువలేకపోతున్నాడు. ఈ విధంగా వుంటే ఈ సంవత్సరం పరీక్ష గట్టెక్కినట్లే అనుకున్నాడు పలుమార్లు.

ఇదీకాక రాజశేఖరానికింకో క్రొత్త చిక్కొచ్చింది. రోజాకు సినీమాల పిచ్చి జాస్తి. వచ్చిన ప్రతి సినీమా చూస్తుంది. ఇప్పుడు రాజశేఖరాన్ని తనతో ప్రతి సినీమాకు బలవంతంగా తీసుకెళ్తున్నది. రోజాతో స్నేహం కొద్దిగా తగ్గించాలని ఓ నాలుగురోజులు ఆమెను తప్పించుకొని తిరిగేడు. ఐదో రోజు వుదయం తెల్లారేసరికి ముకుందరావుగారు, సుమిత్ర రాజశేఖరం రూంకి వచ్చేరు. వాళ్ళను చూసి ఆశ్చర్యపోయేడు రాజశేఖరం.

"రండి, రండి కూర్చోండి" అంటూ కుర్చీలు చూపించేడు చదువుతూన్న పుస్తకాన్ని మూసి టేబిల్ మీద వుంచుతూ.

"ఏం రాజా! మామీద కోపం వచ్చిందా? లేక అమ్మాయేమైనా దుడుకుగా ప్రవర్తించిందా! మా యింటికి రావడం మానీసేవు" అన్నారు ముకుందరావుగారు.

'అబ్బే అటువంటిదేం లేదండీ. మా ఎగ్జామినేషన్స్ దగ్గరవుతున్నాయి......"

'అమ్మాయిని తప్పించుకొని తిరుగుతున్నావట. మా వల్లేదో పొరపాటు జరిగిందని నిన్నంతా అలిగి పడుకుంది" సుమిత్రగారి గొంతుక జీరపోయింది.

రాజశేఖరం హృదయం కలుక్కుమంది.

"సారీ పెద్దవాళ్ళను మిమ్మల్ని అనవసరంగా నొప్పించేను. చదువులో కాస్త వెనకపడకుండా వుండాలని కాని...." అన్నాడు.

"రాజా ఈరోజు సన్‌డే కదా! మా యింటికి రాకూడదూ? అక్కడే చదువుకోవచ్చు" అన్నారు సుమిత్రగారు.

రాజశేఖరం కాదనలేకపోయేడు. ఓ రెండు పుస్తకాలు చేత్తో పట్టుకొని రూంకి తాళం వేసి వాళ్ళతో బయల్దేరేడు.

రాజశేఖరం ప్రతిరోజూ సాయంత్రం ముకుందరావు గారింటికి వెళ్ళి ఓ అరగంట కూర్చుని వచ్చేస్తున్నాడు. ముకుందరావుగారు అతడ్ని మునుపటిలా ఎక్కువసేపు వుండమని బలవంతం చెయ్యడం లేదు.

ఓ రోజు వుదయం రోజా వచ్చేసరికి రాజశేఖరం పడుక్కొని వున్నాడు. రోజా అతని నుదుటి మీద చేయి వేసి చూసింది. రోజా స్పర్శకు రాజశేఖరం కళ్లు తెరిచేడు. ఎదురుగా వున్న రోజాను చూసి పేలవంగా నవ్వేడు.

"మై గాడ్! ఫీవరు చాలా ఎక్కువగా వున్నట్లుందే నిన్న సాయంత్రం మా యింటి కొచ్చినప్పుడు బాగానే వున్నారు మరి ఫీవరెప్పుడొచ్చింది? మెడిసన్ తీసుకున్నారా? డాక్టర్ని రమ్మన్నారా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

రాత్రి భోజనం చేసిన తర్వాత ఫీవరొచ్చిందని తన దగ్గరున్న టాబ్లెట్సు వేసుకున్నానని చెప్పేడు.

బోయ్ కాఫీ బ్రెడ్ తెచ్చి అతని మంచం ప్రక్కనున్న టీపాయ్ మీద వుంచేడు.

"కాఫీ తీసుకుంటారా?" అంటూ ఫ్లాస్కు మూత తీసింది "ఇపుడేం త్రాగాలని లేదు రోజా! తరువాత తీసుకుంటా. నీకు కాలేజీ టైమవుతోంది వెళ్ళిరా" అన్నాడు.

"మిమ్మల్నిలా వదిలి వెళ్లాలని లేదు. కాని ఫస్టవరు ప్రాక్టికల్సు వున్నాయి. అయిపోగానే వచ్చేస్తా. ఈ లోపల డాక్టర్ని పంపిస్తాను" అతని చేతిని ఒకమారు మెల్లగా నొక్కి బయటకు వెళ్లింది. అనవసరంగా స్కూలు ఎగ్గొట్టి రావద్దని, తనకు ఏం ఫర్వాలేదని చెప్పాలనుకున్నాడు. కాని రోజా వింటుందన్న నమ్మకం లేక వూరుకున్నాడు.

రోజా వెళ్ళిన అరగంటలో ముకుందరావుగారు సుమిత్ర పెద్ద ప్లాస్టిక్ బుట్ట నిండా పళ్లు, బ్రెడ్, ఫ్లాస్కుతో హార్లిక్స్ పట్టుకొని వచ్చేరు. వారి వెనుకనే డాక్టరు కూడ వచ్చేడు.

'అమ్మాయి ఫోను చేసింది. రాత్రి నుంచీ మీకు ఫీవరని అర్జంటుగా డాక్టర్ని తీసుకెళ్ళమని" అన్నారు ముకుందరావు గారు.

"మేం పరాయి వాళ్ళమనుకున్నావా బాబూ! కనీసం కబురైనా చెయ్యలేదు" అంటూ నిష్ఠూరమాడేరు సుమిత్రగారు.

డాక్టరు రాజశేఖరాన్ని పరీక్షించేడు.

"జ్వరం నూట మూడుంది. 'ఫ్లూ' టైప్. వూర్లో అంతటా వుంది మరేం వర్రీ అవకడి. ఇంజక్షన్ చేసేను మరో గంటకల్లా టెంపరేచర్ డౌన్ అవుతుంది. ఈ కేప్సుల్స్ ఆరేసి గంటలకు వెయ్యండి" అన్నాడు.

"ఈవినింగ్ మరోమారు వచ్చి చూడండి డాక్టర్" అన్నారు సుమిత్రగారు.

డాక్టరు సరేనని వెళ్లిపోయేడు.

"పడుక్కో బాబూ! హార్లిక్స్ తీసుకుంటావా?" అన్నారు సుమిత్రగారు.

రాజశేఖరం వద్దన్నా వినకుండా అతని చేత ఓ కప్పు హార్లిక్స్ త్రాగించేరు.

ముకుందరావుగారు ఈజీచైర్లో నడుం వాల్చేరు. సుమిత్రగారు రాజశేఖరం మంచం మీదే కూర్చున్నారు. వారి ఆప్యాయతకు కళ్లు చెమ్మగిల్లాయి రాజశేఖరానికి. డాక్టరు చెప్పినట్లే మరో గంటకల్లా టెంపరేచర్ డౌన్ అయింది. ఆ సాయంత్రం రాజశేఖరాన్ని బలవంతంగా తమ యింటికి తీసుకెళ్లేరు ముకుందరావు దంపతులు.

రాజశేఖరం రెండు రోజులు ముకుందరావుగారింట్లో వున్నాడు. రోజా ఆ

రెండ్రోజులూ రాజశేఖరాన్ని ఒక్క నిముషమైనా విడువకుండా, అతను ఎంత వారిస్తున్నా వినకుండా అన్ని సపర్యలూ చేసింది. మూడోరోజు వుదయం రాజశేఖరం తన రూంకి వచ్చేశేడు. భోజనం మాత్రం హెూటల్లో చెయ్యొద్దని తను పంపిస్తానన్నారు సుమిత్రగారు. రాజశేఖరం కాదనలేకపోయేడు.

ఎగ్జామినేషన్స్ అవగానే వాళ్ళవూరు బయల్దేరేడు రాజశేఖరం. రోజా, ముకుందరావు దంపతులు స్టేషన్‌కి వచ్చి వీడ్కోలు యిచ్చేరు.

రోజా తన ఎగ్జామినేషన్సు అవగానే తప్పకుండా రాజశేఖరం వాళ్ళ వూరు వస్తానంది. ఎప్పుడు బయల్దేరుతున్నదీ రాస్తే తనే ముందుగా వచ్చి తీసుకెళ్తానన్నాడు రాజశేఖరం.

"ఎందుకూ! మేము సమ్మర్‌కి ఊటీ వెళ్తాం. దార్లో అమ్మాయి మీ వూర్లో దిగుతుంది" అన్నారు ముకుందరావుగారు.

"అంటే మీరు మా వూర్లో దిగరన్నమాట!" అన్నాడు.

"రిటర్న్‌లో తప్పకుండా దిగి ఓ నాలుగు రోజులుంటాము సరా?" అన్నారు సుమిత్రగారు.

ట్రైన్ బయల్దేరుతూంటే రాజశేఖరానికి కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లేయి.

## 3

మంగళవారం వుదయం రాజశేఖరం రోజాను రిసీవ్ చేసుకుందికి స్టేషన్‌కి తను కారు తీసుకెళ్ళడమా లేక రెండెడ్ల బండి తీసుకెళ్ళడమా? అని కొంతసేపు ఆలోచించి చివరకు బండే తీసుకెళ్ళాలనుకున్నాడు. తనే స్వయంగా మైసూరు ఎడ్ల జతను పూన్చి బండి తోలుకెళ్ళాడు.

రైలు రైట్టైమ్‌కే వచ్చింది. రోజా ద్వారం దగ్గర నిల్చుని రాజశేఖరాన్ని చూసి చెయ్యూపింది. రాజశేఖరం గబగబా వెళ్ళేసరికి రోజా క్రిందకు దిగింది. ఆ స్టేషన్‌లో రైలు ఒక్క నిముషం కంటే ఎక్కువసేపు ఆగదు. రాజశేఖరం తను తీసుకెళ్ళిన టిఫెన్ పేకెట్సు, ఫ్లాస్కు ముకుందరావుగార్కి అందించేడు. రైలు కనుమరుగయ్యే వరకూ 'టాటా' చెప్పి రోజా సూట్‌కేసు బెడ్డింగు పట్టించుకొచ్చి బండిలో వుంచేడు.

రాజశేఖరం బండి మొత్తాల్లో కూర్చుని బండి తోల్తున్నాడు. రోజా అతని వెనుకనే కూర్చుంది.

ఎడ్ల మెడలో చిరుగంటల చప్పుడు వినడానికి ఎంతో ఇంపుగా వుంది రోజాకి. కృషీవలురు కూనిరాగాలు తీస్తూ పొలాల గట్లపైన నడుస్తున్నారు. అరుణోదయపు పిల్లి వాయువులు పంటచేలపై తరంగాలు సృష్టిస్తున్నాయి. పల్లె పడతులు నీళ్ళ కడవలు తలపై పెట్టుకొని వయ్యారంగా నడుస్తున్నారు. రోజాకు ఎవరి మొహం చూసినా ఎంతో వుత్సాహం తృప్తి వున్నట్లు కన్పించింది.

బండి దిగి యింట్లో అడుగు పెట్టగానే ఆశ్చర్యపోయింది రోజా. రాజశేఖరం యిల్లు

తనూహించినట్లు గాక అంతా అధునాతన పద్ధతుల్లో వుండడం చూసి.

రాజశేఖరం వాళ్ళ మేనత్త శేషమ్మగార్ని, పద్మను, పరిచయం చేసేడు రోజాకు.

"ఏవమ్మా! ప్రయాణం సౌఖ్యంగా జరిగిందా? నీవు వంటరిగా వచ్చావేం? మీవాళ్ళు రాలేదా?" అన్నారు శేషమ్మగారు.

పద్మ, రోజాను ఒకమారు ఆపాదమస్తకం చూసి ముభావంగా వూరుకుంది.

చంద్రయ్య, రోజా పెట్టె బెడ్డింగు మేడ మీద ఆమె కోసం ప్రత్యేకించిన గదిలో వుంచేడు.

"రోజా నువ్వు త్వరగా స్నానం చేస్తే కాఫీ టిఫిన్ మన కోసం వెయిట్ చేస్తున్నాయి" అన్నాడు రాజశేఖరం.

రోజా గబగబ మేడ మీదకు వెళ్ళింది.

రాజశేఖరం కూడ స్నానం చేసి డ్రస్సు మార్చుకున్నాడు.

కాఫీ టిఫిన్లు పూర్తయిన తరువాత రోజాను తీసుకొని రామం వాళ్ళింటికి బయల్దేరేడు. పద్మను కూడ తమతో రమ్మన్నాడు.

"అదేవిట్రా! వారం వర్జం లేకుండా అదెలా వస్తుంది వాళ్ళింటికి! మీరు వెళ్ళిరండి" అన్నారు శేషమ్మగారు.

ఆవిడ మాటలు అర్థం కాలేదు రోజాకు. దార్లో రాజశేఖరం క్లుప్తంగా చెప్పేడు.

రామం, మంజుల వారిరువుర్నీ గుమ్మంలోనే ఎదురొచ్చి ఇంట్లోకి తీసుకెళ్ళేరు. రాజశేఖరం, రోజాను పరిచయం చేసేడు.

మంజుల అందం చూసి ఆశ్చర్యపోయింది రోజా. ఆమె ఆప్యాయతకు వుక్కిరి బిక్కిరైంది.

మధ్యాహ్నం పన్నెండు గంటలవరకూ సరదాగా మంజులతో కబుర్లు చెప్తూ కూర్చుంది రోజా.

మంజుల వారిద్దర్నీ ఆపూట తమ యింట్లో భోజనం చేస్తేనేకాని కదలనీయలేదు.

"అదేవిట్రా రాజూ? వెళ్ళినవాళ్లు అక్కడే వుండిపోయారు ఇంతసేపు! త్వరగా రండి వడ్డించేస్తాను" అన్నారు శేషమ్మగారు ఇంటికి రాగానే.

"మేం అక్కడ భోజనం చేసే వస్తున్నాం అత్తయ్యా" అన్నాడు రాజశేఖరం.

"ఇది మరీ బావుందర్రా! ఇక్కడ మీకోసం స్పెషల్స్ అవి చేయించి కాచుక్కూర్చుంటే అక్కడెందుకు భోంచేసేరు?" అన్నారు కాస్త చిరాగ్గా.

రాజశేఖరం ఆమె మాటలు విన్పించనట్లే గబగబా మేడ మీదకు వెళ్ళిపోయేడు రోజాతో సహా.

రోజాకు రాజశేఖరం తన లైబ్రరీ చూపించేడు. తెలుగు ఇంగ్లీషు బుక్సు సుమారు ఐదారు వందలున్నాయి. అన్ని బుక్సు చూసి ఆశ్చర్యపోయింది రోజా. ఓ నాలుగు నవల్సు తీసుకొని తన గదిలోకి వెళ్ళింది.

రోజాను, పద్మను తీసుకొని సాయంత్రం తోటవేపు షికారు బయల్దేరేడు

రాజశేఖరం. దార్లో కనుపించిన ప్రతివారూ రాజశేఖరానికి వినయంగా నమస్కరించ ఆప్యాయంగా పల్కరించడం రోజాకు ఎంతో వింతగా వుంది.

వారు తోటలో అడుగు పెట్టేసరికి "సినబాబూ!" అంటూ పరుగు పరుగున వచ్చింది పన్నెండేండ్ల అమ్మాయి. "వీరయ్యని మా తోటమాలి కూతురు నాగి" అంటూ రోజాకు పరిచయం చేసింది పద్మ.

"దండాలండి" అంది నాగి రోజాను ఆపాదమస్తకం చూసి "ఏటి సిన్నమ్మగోరూ తోటసుట్టు రావడంనేదు" అంటూ ముందుకు పరుగులంకించుకుంది.

రాజశేఖరం తోటలో వున్న తమ గెస్ట్‌హౌస్ వేపు దారితీసేడు. గెస్ట్‌హౌస్ వద్ద వీరయ్య, నాగి వారికి ఎదురొచ్చారు. రాజశేఖరం రోజాకు వీరయ్యను పరిచయం చేసేడు. ఈ గెస్ట్ హౌస్‌పని తోటపని అంతా వీరయ్యదేనని తోటను చక్కగా సంరక్షిస్తున్నాడని చెప్పేడు.

నాగి వాళ్ళ ముగ్గురకూ ఆరముగ్గిన సపోటాపళ్లు, బొత్తాయి పళ్లు ప్లేట్లలో పెట్టి అందించింది. వీరయ్య ఒక కొబ్బరి చెట్టు నుంచీ మూడు గంగ బొండాలు దించి నీళ్లు గ్లాసుల్లో పోసి యిచ్చేడు. నాగి వారి ముగ్గురి వెంట తిరిగి సపోటా చెట్లు, బత్తాయి చెట్లు, అంటు మామిడి మొక్కలు చూపించింది. తోట వెనుక నుండీ అమృతవాహినిలా ప్రవహిస్తున్న ఏటిని చూసింది రోజా.

"కాస్సేపు ఏటి గట్టున కూర్చుందాం బావా!" అంది పద్మ యిసుకలో కూర్చుంటూ. రాజశేఖరం ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. రోజా అతని ప్రక్కనే కూర్చుంది. నీటి మీద నుంచి వస్తున్న చల్లని గాలి వార్ని గిలిగింతలు పెట్టినట్లుంది.

"పులిబోను ఆడదామా?" అంటూ నాగి చిక్కంలోంచి గవ్వలు తీసింది. అర్థం కానట్లు రాజశేఖరం వేపు చూసింది రోజా. రాజశేఖరం పులిబోను ఆట గురించి రోజాకు చెప్పేడు. నాగి ఇసుకలో గళ్లు గీసింది. "పెద్ద గవ్వలు పులులు, చిన్నవి మేకలు" అని చెప్పింది. పద్మ, నాగితో ఆట ప్రారంభించింది.

"సినబాబూ! మీరు సెప్పకూడదు సిన్నమ్మగోరికి, పల్లకుండాలి" అంటూ రాజశేఖరాన్ని హెచ్చరించింది నాగి. పద్మ ఒక పర్యాయం పులులు, ఒక పర్యాయం మేకలు తీసుకొని ఆడి ఓడిపోయింది. తరువాత రోజా ఆడింది. నాగితో కాని రెండు పర్యాయాలు ఓడిపోయింది. రోజా రాజశేఖరాన్ని కూడ ఆడమంది. రాజశేఖరం రెండు పర్యాయాలు గెలిచేడు. "సినబాబుతో మా అయ్య కూడా ఆడనేడు" అంది నాగి గర్వంగా. 'నీకు స్విమ్మింగొచ్చా?" అంది రోజా నాగితో.

'అంటే!"

'అదే నీకు ఈత కొట్టడం వచ్చా!" అన్నాడు రాజశేఖరం.

"శానా బాగా వొచ్చండి. కాని ఏట్లో దిగనండి వాడి జాస్తి" అంది.

సూర్యుడు పడమటి కొండల మాటున దిగజారుతున్నాడు. "బావా! చీకటి పడుతూంది ఇంక ళ్దామా!" అంది పద్మ. నాగి వార్ని రోడ్డు వరకూ సాగనంపింది. వారు

ఇంటికొచ్చేసరికి పద్మ తండ్రి పరమేశ్వరంగారు ఎదురొచ్చారు.

"ఏం మామయ్యా ఎప్పుడొచ్చావ్?" అన్నాడు రాజశేఖరం. "ఏదీ యిప్పుడేనోయ్ ఓ అరగంటయింది. తోటవేపు వెళ్ళారేంటి"

"అవును మామయ్యా! అన్నట్లు వీరు మా అంకుల్ పరమేశ్వరంగారు. పద్మ ఫాదర్. ఈ అమ్మాయి 'రోజారాణి' మా ఫ్రెండు. మనవూరు చూద్దామని హైదరాబాద్ నుంచి వచ్చింది" అంటూ రోజాకు పరమేశ్వరంగార్ని పరిచయం చేసేడు.

రోజా పరమేశ్వరంగార్కి నమస్కరించి మేడ మీదకు వెళ్ళిపోయింది. "ఏం రాజూ పరీక్షలెలా రాసేవు?" అన్నారు పరమేశ్వరంగారు. రోజా వెళ్ళినవేపే చూస్తూ "బాగానేరాశాను మావయ్యా! క్లాసు తప్పకుండా వస్తుంది" అన్నాడు రాజశేఖరం.

రాత్రి అందరూ కులాసాగా కబుర్లు చెప్పకుంటూ భోజనం. ముగించేరు. పరమేశ్వరంగారు తను మేడ ఎక్కలేనని తనకు క్రింద గదిలోనే పక్క ఏర్పాటు చెయ్యమన్నారు. రాజశేఖరం, చంద్రయ్యతో చెప్పి ఆయనకు క్రిందగదిలోనే పక్క ఏర్పాటు చేయించేడు. రాజశేఖరం తన గదిలో మంచం మీద పడుక్కొని వీక్లీ తీసేడు చదువుదామని.

"ఎప్పుడూ చదువేనేంటి బావా! కాస్సేపు ఏవైనా కబుర్లు చెప్పు" అంటూ రాజశేఖరం చేతిలో పుస్తకం తీసి వేసింది పద్మ. "పోనీ నీకు నిద్ర రాకుంటే కాస్సేపు రోజాతో కబుర్లు చెప్పరాదు" అన్నాడు నవ్వుతూ.

పద్మ రాజశేఖరం వేపు కోపంగా చూసింది. 'నీకంటే పుస్తకాల పురుగు ఆవిడ!"

"అయితే నువ్వు చెప్పు కబుర్లు నేవింటా" అన్నాడు.

"రాజూ మీ మావయ్యగారు నిన్నోమాటు రమ్మంటున్నారు" అన్నారు శేషమ్మగారు. రాజశేఖరం శేషమ్మగారి వెంట క్రిందకు వెళ్లేడు. "రావోయ్ రాజూ! నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడదామని వచ్చేను" రాజశేఖరం ప్రశ్నార్థకంగా ఆయన వేపు చూసేడు. "అదేనోయ్ వచ్చేనెల్లో మంచి ముహూర్తాలున్నాయిట తరువాత మళ్లీ ఆర్నెల్ల వరకూ మంచివి లేవుట అంచేత వచ్చేనెల్లో పద్మ పెళ్లి చేసెయ్యాలనుకుంటున్నాము"

"చాలా సంతోషం మామయ్యా! సంబంధం చూసేరా? ఏవూరు? కుర్రాడేం చేస్తున్నాడు?" అన్నాడు రాజశేఖరం. పరమేశ్వరంగారు వస్తున్న కోపాన్ని అదిమిపట్టేరు. శేషమ్మగారు ఏమో చెప్పబోతే ఆమెను వారించేరు. 'ఈవూరేనోయ్! మొన్ననే ఎం.ఏ. పరీక్ష కెళ్ళాడు. పేరు రాజశేఖరం...."

"మావయ్యా!"

"మీరూరుకోండి! ఏమిటో మీ యిద్దరికీ నవ్వులాటలుగా వున్నట్లుంది. రాజూ ఏవిటి.నీ ఉద్దేశం? పద్మను చేసుకుంటావా? చేసుకోవా?" సూటిగా అడిగేరు శేషమ్మగారు. రాజశేఖరం క్షణకాలం నివ్వెరపోయేడు. "అత్తయ్యా! కాస్త శాంతంగా మాట్లాడు. నేను పద్మను చేసుకుంటానని మీతో ఎప్పుడూ అనలేదే! మీరుకాని పద్మకాని ఏవో లేనిపోని ఆశలు కల్పించుకుంటే అందుకు నేను బాధ్యుడ్ని కాదు. నాకిప్పుడప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు" అన్నాడు రాజశేఖరం. "విన్నారా! విన్నారా వాడి మాటలు? నేననుకున్నంతా

అయింది"

"అది కాదోయ్! పోనీ ఇంకొంత కాలం ఆగాలనుకుంటే అలాగే కానీ, ఇప్పుడు మించిపోయిందేం లేదు"

"ఇంకెందుకండీ వీడ్ని పట్టుకొని దేవులాడ్డం. వీడి వేషాలు, విలాసాలు ప్రత్యక్షంగా చూస్తూ. ఆ దొరసానమ్మని తెచ్చి యింట్లో పెట్టుకున్నాడుగా! ఏ రిజిష్టర్డు పెళ్లో చేసుకొనే వుంటాడు. మనకేం చెప్తాడేంటి?"

"అత్తయ్యా అనవసరంగా ఆ అమ్మాయినేం అనకు వింటే బావుండదు"

"ఏం? ఎందుకు బావుండదూ? వున్నమాట అంటే వులికెక్కువట. ఒక మారుకాదు, వంద మార్లంటాను మా అమ్మాయి జీవితంలో నిప్పులు పోసిందని. ఎంత స్నేహితులైనా పరాయి మొగాడింటికి ఒంటరిగా అలా బరితెగించొస్తుందా? అవ్వ! ఆ బెల్‌బాటములు, ఆ తిరుగుళ్లు సంసార స్త్రీల లక్షణాలేనా? ఇటువంటివి మన ఇంటా వంటా వున్నాయిరా? పోనీ యీ పిల్లకి బుద్ధి లేకుంటే కన్న తల్లిదండ్రులకేనా వుండొద్దురా?" కోపంతో రెచ్చిపోయారు శేషమ్మగారు.

రాజశేఖరానికి వాళ్ళ మేనత్త మీద ఎక్కడలేని కోపం వచ్చింది. "అత్తయ్యా నువ్వింత నీచంగా మాట్లాడుతావని నేనెప్పుడూ అనుకోలేదు. మీరేం అనుకున్నా ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. పద్మను నేను పెళ్లి చేసుకోను" అంటూ చరచర మేడ మీదకు వెళ్ళిపోయేడు. అతడి మనస్సంతా వికలమైంది. "పాపం రోజా అనవసరంగా మాట పడింది. ఈ విషయం తెలిస్తే ఆమె సహించగలదా? ఏమనుకుంటుంది" అనుకున్నాడు.

క్రింద గదిలోంచి యింకా మేనత్త సణుగుడు విన్పిస్తూంది. గది తలుపులు దగ్గరగా మూసి లైటార్పి మంచం మీద పడుక్కున్నాడు రాజశేఖరం. సుమారు అరగంట కాలం గడిచింది. తలుపు తెరచిన శబ్దానికి లేచి మంచం మీద కూర్చున్నాడు. పద్మ వచ్చింది. "బావా! అమ్మ చెప్పింది నిజమేనా? నువ్వు ఆ అమ్మాయిని చేసుకుంటావట?" ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అడిగింది.

"చూడు పద్మా! ఆ అమ్మాయిని నేను చేసుకుంటానని ఎప్పుడూ ఎవరితోనూ అనలేదు. అసలు ఆ ఆలోచనే నాకు లేదు. ఒక పురుషుడూ స్త్రీ కాస్సేపు మాట్లాడినంత మాత్రాన వారికి అభాండాలు అంటగట్టి నీచంగా మాట్లాడ్డం సంస్కారవంతుల లక్షణం కాదు. అత్తయ్య యింత నీచంగా మాట్లాడుతుందని నేను కల్లో కూడా అనుకోలేదు" అన్నాడు.

"అది కాదు బావా...."

"సారీ! పద్మా ఇప్పుడు నన్నేం డిస్టర్బ్ చెయ్యకు ప్లీజ్ వెళ్ళిపో!" అన్నాడు. పద్మ, రాజశేఖరం వేపొకమారు చూసి బయటకు వెళ్ళిపోయింది. రాజశేఖరానికి రాత్రి చాలా పొద్దుపోయే వరకూ నిద్ర పట్టలేదు. ఆలోచనల్తో తల పగిలిపోతూందేమో ననుకున్నాడు.

తెల తెలవారుతుండగా చంద్రయ్య పిలుపు విని ఉలికిపడి లేచేడు. "మావయ్యగోరు, అత్తయ్యగోరు, సిన్నమ్మగోరు బండిలో కూకున్నారండి! తమతో సెప్పమన్నారు"

అన్నాడు చంద్రయ్య. రాజశేఖరం క్షణకాలం నిర్ఘాంతపోయేడు. వెంటనే గబగబా క్రిందకు వెళ్ళేడు. బండిలో శేషమ్మగారు, పద్మ కూర్చున్నారు. వారి సామాన్లు బండిలో సర్ది వున్నాయి.

"మేం వెళ్లొస్తామోయ్!" అన్నారు పరమేశ్వరంగారు రాజశేఖరాన్ని చూడగానే. "అదేవిటి మావయ్యా! ఎక్కడికి ప్రయాణం? ఇంత అర్జంటుగా"

"ఎక్కడి కెళ్తామోయ్? మావూరే" అన్నారు పేలవంగా నవ్వి. 'కబుర్లింక కట్టిపెట్టి బండెక్కండి టైమవుతోంది" అంటూ భర్తను మందలించి 'పోనీరా' అంటూ బండివాడ్ని గదమాయించేరు శేషమ్మగారు.

రాజశేఖరానికి నోటమాటరాలేదు. బండి కనుమరుగయే వరకూ చూసి ఇంట్లోకి వచ్చేడు. అతని మనస్సు పరిపరి విధాల పోతోంది. తనుకాని తొందరపడ్డానేమోనని కొద్దిగా బాధపడ్డాడు. అయినా తన పెళ్ళి విషయంలో ఒకరి ఒత్తిడికి లొంగడమేమిటని తన్నుతాను సమాధాన పరచుకున్నాడు.

డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంటూ రోజా అడిగింది. పద్మ, ఆంటీ ఏరని. "ఊరికి వెళ్ళారు" అన్నాడు రజాశేఖరం. "ఊరికా? మరి నాకు చెప్పలేదేం?" అంటూ నొచ్చుకుంది.

"వాళ్లు చాలా ఎర్లీగా వెళ్లిపోయారు. రోజా, అనవసరంగా నీ నిద్ర ఎందుకు పాడు చెయ్యడమని నన్ను చెప్పమన్నారు" అన్నాడు రాజశేఖరం పేలవంగా నవ్వి. రోజా ఏమనుకుందో కాని ఆ విషయం మరి ప్రస్తావించలేదు. వారు కాఫీ టిఫెన్ తీసుకొని బయటకు వచ్చేసరికి రామం వచ్చేడు.

"ఏం రాజూ! అర్జంటుగా రమ్మని కబురు పంపేవుట" రాజశేఖరం రామాన్ని డ్రాయింగ్ రూంలోకి తీసుకెళ్ళి జరిగిందంతా చెప్పేడు. "నువ్వేం విచారించకు రాజూ! అత్తయ్యగారి సంగతి మనకు తెలియంది కాదు. నాలుగు రోజుల్లో అంతా మర్చిపోయి 'రాజూ' అంటూ ఆవిడే తిరిగి వస్తారు. ఈ మాత్రం దానికి నువ్వు దిగులు పడనవసరంలేదు" అంటూ ధైర్యం చెప్పేడు. రామం కొద్దిసేపు కూర్చొని ఇంటి విషయాలు, పొలం సంగతులు మాట్లాడి వెళ్లిపోయాడు.

రాజశేఖరం లేచి మేడ మీదకు వెళ్ళబోయి ఎదురుగా వస్తున్న రోజాను చూసి ఆశ్చర్యపోయాడు. ఫారెన్ నైలెక్స్ చీర నేరొకట్ కట్టింది. ఒక చేతికి బంగారు గాజులు ఒక చేతికి రిస్ట్ వాచి జడలో గులాబీ పువ్వు. "ఏవిటలా చూస్తున్నారు!" అంది రోజా సిగ్గుపడుతూ. "ఈ డ్రస్సులో నిన్ను పోల్చుకోలేకపోయానుసుమీ! చాలా బాగుంది. నువ్వు చీరలో ఎంతో అందంగా వుంటావు" అన్నాడు. "నిజంగానా?"

"ఆఁ! ఇంతకూ యింత అర్జంటుగా వేషం ఎందుకు మార్చినట్లు?" అన్నాడు రాజశేఖరం అనుమానంగా. "మీ కోసమే, బావుందన్నారుగా" అంది సిగ్గుపడుతూ. "ఐసీ" అన్నాడు నవ్వుతూ. వారు మాట్లాడుతూండగా "సినబాబూ" అంటూ నాగి వచ్చింది. చేతిలో వున్న పళ్లబుట్ట క్రింద పెట్టింది.

"ఎవురూ! బుల్లెమ్మగోరే! నాను గురుతు పట్టనేకపోనా! కోక కడితే తవరు శానా బావున్నారు" అంది నాగి రోజాను ఆపాదమస్తకం చూస్తూ. "సినబాబూ మా అయ్య బైట కూకున్నాడండి" అంది రాజశేఖరంతో. రాజశేఖరం బయటకు వచ్చేడు.

"ఏం వీరయ్యా! పని మీద వచ్చేవా?"

"అబ్బే నేదండి. పెద్దమ్మగోరు ఆళ్ళూరు ఎల్లిపోయారని దెల్సి బొట్టి ఒచ్చిందండి. దాని ఎంట నానూ వొచ్చానండి పల్ల బుట్ట వొట్టుకొని" అన్నాడు.

నాగికి చిన్నప్పటి నుండీ రాజశేఖరం దగ్గర చనువు జాస్తి. రాజశేఖరం వూర్లో వున్నన్ని రోజులూ నాగి రాజశేఖరం ఇంట్లోనే వుంటుంది. అతనికి కావల్సిన సదుపాయాలన్నీ తనే స్వయంగా చూస్తుంది. కాని శేషమ్మగారికి మాత్రం నాగిని చూస్తే మంట. అందుకని ఆవిడ వున్నప్పుడు నాగి రాజశేఖరం యింటి ఛాయలకు కూడా రాదు. తన తండ్రి దగ్గరే తోటలో వుంటుంది.

వీరయ్య కొద్దిసేపు రాజశేఖరంతో మాట్లాడి వెళ్ళిపోయేడు. రోజా నాగిని ఒకమారు ఆపాదమస్తకం చూసింది. ఈరోజు నాగి కడిగిన నాగమణిలా వుంది. ఇస్త్రీ చేసిన లంగా జాకెట్ వేసుకుంది. తల నున్నగా దువ్వుకొని రెండు జడలు వేసుకుంది. "రోజా, నాగి యిక్కడే వుంటుంది. నీకేం కావాలన్నా అడుగు" అన్నాడు రాజశేఖరం.

"ఏవయ్యోయ్! వంటాశార్లూ! ఈ పొద్దేటి వంటలు సేస్తన్నావ్!" అటుగా వస్తున్న వంటాయన్ను కేకేసింది నాగి. "నువ్వొచ్చావా తల్లీ! సంతోషం! రా, అమ్మా దీనికి లక్షసార్లు చెప్పేను నా పేరు 'తిరువేంకటాచార్యులు' అని, దీని బండ నోరు మరి తిరగదు" అన్నాడు నవ్వుతూ.

"పద ముందు నువ్వు టిఫిన్ తిని తరువాత ఆర్డరు జారీ చేదువుగాని. నీ మాటకు ఎదురేంటి ఏం చెయ్యమని పురమాయిస్తే అవే చేసి పెడతా" అంటూ నాగితో వంటయింటి వేపు వెళ్ళిపోయాడు. "మా ఆచారిగార్కి నాగి అంటే ఎంతో అభిమానం" అన్నాడు రాజశేఖరం వాళ్ళు వెళ్ళినవేపే చూస్తూ. "చాలా క్లెవర్ గర్ల్" అంది రోజా. మంజుల వాళ్ళింటికి వెళ్లొద్దాం రమ్మంది రోజా రాజశేఖరాన్ని.

"మా రాజాతో వస్తున్న సుందరాంగెవరాని ఆశ్చర్యపోయాను! మీరా?" అంది మంజుల విస్మయంగా చూస్తూ. "మీరీ డ్రస్సులో చాలా బావున్నారు" అన్నాడు రామం. రోజా బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కేయి. "మరి మీ పొలాలు అవి ఎప్పుడు చూపిస్తారు?" రామాన్ని అడిగింది రోజా. మీరు ఎప్పుడు వస్తానంటే అప్పుడే" "అలా అనకురా బాబూ! ఈవిడ సంగతి నీకింకా తెలియదు. లేడికి లేచిందే వేళని ఇప్పుడే పదమంటుంది" అన్నాడు రాజశేఖరం నవ్వుతూ.

"మీరు తీసుకెళ్ళి చూపిస్తాననడం పోయింది, ఆయన చూపిస్తానంటే ఆపుజేస్తారేం!" అంది రోజా చిరుకోపం ప్రదర్శిస్తూ. "హతోస్మి! పద బాబూ" అన్నాడు. "ఈ ఎండలో ఎక్కడికెళ్తారు! సాయంత్రం వెళ్ళండి" అంది మంజుల కాఫీ కప్పులు అందిస్తూ. "మీరు బి.యస్.సి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు కదా మరి ఫర్దర్ స్టడీస్ ఆపుచేసేరేం?" మాటల

సందర్భంలో రోజా అడిగింది రామాన్ని.

"పరిస్థితులు అనుకూలించలేదండి! మా ఫాదర్, రాజా ఫాదర్ కొద్ది రోజుల వ్యవధిలోనే పోవడం మరి మాది వాళ్ళదీ కల్టివేషన్ సరిగా చూసే వాళ్లు లేకపోవడం, మా యిద్దర్లో ఎవరైనా స్వయంగా ఇక్కడుండి చూడకపోతే వీల్లేకపోయింది" అన్నాడు.

"అందుకని మీ ఫ్రెండు కోసం మీ స్టడీస్ శాక్రిఫైజ్ చేసేరన్నమాట" అంది రోజా నవ్వుతూ. "మేమెప్పుడు అలా అనుకోమండి! రాజానే తను ఇక్కడుండి వ్యవసాయం చూస్తా నన్ను వెళ్లి చదువుకోమని అన్నాడు"

"ఏవండోయ్! సాయంత్రం మీరు కూడా మాతో షికారుకి రావాలి!" "నేనా?" అంది మంజుల ఆశ్చర్యంగా.

'అవునండి మీరే!"

"నేనెలా వస్తానండి...."

"ఏం? ఎందుకు రాకూడదూ. మీరు లేనిపోని చాదస్తాలు ఏం పెట్టుకోకండి. నేను మీతో కూడా వుంటా ఎవరేమంటారో చూస్తా"

"చూద్దాం లెండి" అంది మంజుల. "చూద్దాం అంటే కాదు. మీరు రాకపోతే నేను మీ యింటి దగ్గర స్ట్రైక్ చేస్తాను" అంది రోజా నవ్వుతూ. "ఏటి మంజులమ్మోయ్! సినబాబుకు, బుల్లెమ్మగోరికీ యీ పొద్దుకూడా మీ యింటికాడే విందులు సేద్దావనుకున్నావేటి? అదేటీ కుదర్దు" అంటూ సుడిగాల్లా నాగి వచ్చింది.

"రావే నాగులూ! ఏమిటీమధ్య కనిపించడం మానీసేవు. ఇప్పుడే అనుకుంటున్నా నువ్వింకా దిగపడలేదేమాని" అంది మంజుల నవ్వుతూ. "మా 'రాజు' బయటికి వస్తే కబుర్లతో కాలక్షేపం చేసేస్తాడు. తిండి, నిద్ర మీద ధ్యాస వుండదండి! ఈ నాగి మావాడ్ని యిలానే వెతుక్కుంటూ వచ్చి ఇంటికి ఈడ్చుకెళ్తుంది" అన్నాడు రామం నాగి చెవి మెలిపెడ్తూ.

"రాంబాబుగోరూ! ఈ సుట్టు నా సెవి మెలెడితే మీ సేయి కొరికేత్తా" అంటూ బుంగమూతి పెట్టి బెదిరించింది. అందరూ ఫక్కున నవ్వేరు. "వస్తామండి సాయంత్రం మాత్రం మీరూ రడీగా ఉండాలి" అని మళ్లీ హెచ్చరించింది రోజా వెళ్ళే ముందు.

"ఏమిటి ఇన్ని వైరైటీస్ చేసేరు!" అంది రోజా డైనింగ్ టేబిల్ మీద వున్న పదార్థాలను చూసి ఆశ్చర్యపోతే. ఏటున్నాయని! ఎక్కువేటీ సెయ్యనేదు. తాపీగా కూకొని భోం చేయండి" అంది నాగి. నాగి వారిరువురికి కొసరి కొసరి వడ్డించింది. "బాప్‌రే! ఓ నాలుగు రోజులిలా తిన్నానంటే "టుం టుం"లా తయారవుతాను" అంది రోజా నవ్వుతూ. "ఏటి మాసెడ్డ తినేసినారు బుల్లెమ్మగోరు! మీ తిండి పిట్టమేత!" అంది నాగి నవ్వుతూ.

మంజుల ఆ సాయంత్రం తను వాళ్ళతో షికారు కెళ్ళకుండా వుండాలని ఎన్నో విధాల ప్రయత్నించింది. కాని ఆమెను రోజా విడిచిపెట్టలేదు. ఇంక లాభంలేదని చివరకు బయల్దేరింది.

"రాత్రి భోజనం అందరికీ మనింట్లోనే. ఆచారిగారితో చెప్పి ఏర్పాటు చేయించు" అంటూ నాగికి పురమాయించేడు రాజశేఖరం.

పొలం గట్టుపైన నడక అలవాటు లేక రెండు పర్యాయాలు జారి పడబోయింది రోజా. రాజశేఖరం ఆమె పడకుండా పట్టుకున్నాడు. "దిక్కులు చూస్తూ నడిస్తే చెయ్యో, కాలో విరుగుతుందమ్మోయ్! జాగ్రత్త!" అంటూ నవ్వుతూ హెచ్చరించాడు రాజశేఖరం.రామం, రాజశేఖరం తమ పొలాలు చూపించి వ్యవసాయం, పంటల గురించి చెప్పేరు. తరువాత వారు ఏటి ఆనకట్టు, రిజర్వాయరు, పంట కాలువలు చూపించి వాటి గురించి విపులంగా చెప్పేరు. చీకటి పడేవరకూ ఆనకట్టపైన కూర్చుని తరువాత ఇంటి ముఖం పట్టేరు. మంజుల, రామ్మం రాత్రి భోజనం రాజశేఖరం ఇంట్లోనే చేసేరు. భోజనమైన తరువాత వాళ్లు నలుగురూ చాలా రాత్రివరకూ కేరమ్స్ ఆడేరు.

రెండువారాలు ఇట్టే గడిచిపోయినట్లుంది రోజాకు. ప్రతిరోజూ ఉదయం మంజుల వాళ్లింటి దగ్గర సరదాగా కబుర్లు చెప్తూ గడపడం, సాయంత్రం నలుగురూ ఏటివైపు కాని, తోట వైపుకాని షికారు కెళ్లడం, రాత్రి నిద్రవచ్చే వరకూ కేరమ్స్ ఆడ్డం. ఇదీ వారి దినచర్య. వేసవి అయినందువల్ల పొలం పన్లు అట్టేలేని కారణం చేత రామం కూడ వాళ్ళతో సరదాగా గడుపుతున్నాడు.

గత పదిహేను రోజుల్లో రోజా రామానికి అతి సన్నిహితురాలవడం గమనించేడు రాజశేఖరం. ఈమధ్య రామం ప్రతి కదలికను ఆశక్తితో గమనిస్తోంది రోజా. రామంతో మాట్లాడుతున్నప్పుడు రోజా బుగ్గలు ఎరుపెక్కుతున్నాయి సిగ్గుతో.

"భైరవి కొండకు పిక్‌నిక్‌కి వెళ్తే బావుంటుందీ సమ్మర్లో" అన్నాడు రామం ఓరోజు మాటల సందర్భంలో. "భైరవి కొండా? ఎక్కడుంది? ఎంత దూరం? అక్కడ చూడ్డాని కేమిటేమిటున్నాయి? మరిన్నాళ్లూ నాకు చెప్పలేదేం రాజా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది రోజా.

భైరవి కొండ ఇరవై మైళ్ల దూరంలో వుందని భైరవీ దేవి ఆలయం, ఆలయం ప్రక్కనే వాటర్ స్ప్రింగ్ యింకో కొండపైన బౌద్ధ స్థూపాలు, భైరిపురం రాజావారి విలాస గృహశిధిలాలూ వున్నాయని చెప్పేడు రాజశేఖరం.

"ఇంత దగ్గర్లో అంత మంచి పిక్‌నిక్ స్పాటు వుంటే యిలా వూరుకోవడం ఏంటి రాజా!" అంది రోజా. "లేదు రోజా! రేపుదయం అందరం వెళ్దాం. ఎనిమిది గంటలకు అంతా రడీగా వుండండి" అన్నాడు రాజశేఖరం.

మర్నాడుదయం అనుకున్నట్లే ఎనిమిది గంటలకు అంతా రడీ అయ్యేరు. రెండు కేరియర్స్‌లో భోజన పదార్థాలు, ఫ్లాస్కులో కాఫీ, పళ్లు తీసికొని నలుగురూ రాజశేఖరం కారులో బయల్దేరారు. రోడ్డు అంత బాగులేనందువల్ల వాళ్లు భైరవి కొండ చేరుకునేసరికి తొమ్మిది గంటలయింది. సామాన్లు తీసుకొని కొండ మీదకు వెళ్ళేరు.

భైరవి ఆలయం చిన్నదైనా చక్కటి మండపం వుంది. ప్రక్కనే విశాలమైన మర్రి చెట్టుంది. అటుప్రక్క వాటర్ స్ప్రింగ్ వుంది. అది సంవత్సరం పొడుగునా వుంటుంది. వారు

దేవి దర్శనం చేసుకొన్నారు. అర్చకుడు ప్రతి దినం వుదయాన్నే వచ్చి అర్చన చేసి వెళ్లిపోతాడు. రోజాకు ఆ ప్రదేశం ఎంతో నచ్చింది. ఆ పరిసర ప్రాంతాల్ని వివిధ కోణాల్లో ఫోటోలు తీసింది.

బౌద్ధస్థూపాల్ని చూడ్డానికి వెళ్దాం పదమంది రోజా. భైరవి ఆలయానికి సుమారు మైలు దూరంలో వున్నాయి బౌద్ధస్థూపాలు. వాటికి ఫర్లాంగు దూరంలో విలాసగృహ శిధిలాలున్నాయి. కొండపైకి మెట్లు భైరవి ఆలయం వరకే వున్నాయి. అటుపైన నడకదారి మాత్రమే వుంది.

మంజుల భైరవి ఆలయం చేరుకునేసరికే బాగా అలిసిపోయింది. మండపంలో కూర్చున్నాది. "నేను మరి పైకి రాలేను. మీరు ముగ్గురూ వెళ్ళిరండి నేనిక్కడే కూర్చుంటాను" అంది. ఆమె పరిస్థితి చూసి మరి బలవంతం చెయ్యలేకపోయారు. 'కాని ఆమెను వంటరిగా విడచి ఎలా వెళ్ళడం' అన్న సందేహం కల్గింది.

"రామం నువ్వు రోజాను తీసుకెళ్ళి చూపించు. నేను మంజుల ఇక్కడుంటాము. సామాన్లు కూడా చాలా వున్నాయి కదా!" అన్నాడు రాజశేఖరం. రామం కాదనలేకపోయాడు. రోజాను తీసుకొని వెళ్ళి బౌద్ధస్థూపాలు చూపించి వాటి గురించి వివరంగా చెప్పేడు. రోజా వాటి ఫోటోలు తీసింది. తరువాత విలాసగృహ శిధిలాలు కూడ చూపించేడు. ఎండ క్రమక్రమంగా ఎక్కువ అవుతున్నందువల్ల వాళ్లు తిరిగి భైరవి ఆలయం వేపు బయలుదేరేరు.

మండపంలో స్తంభాన్ని ఆనుకుని కూర్చున్న మంజులను చూసేడు రాజశేఖరం. మంజు లకూడ ఒకటి రెండు పర్యాయాలు రాజశేఖరం వేపు చూసింది. అతను తనవేపే చూస్తున్నందువల్ల దృష్టి మరల్చింది. రాజశేఖరం గంటకొట్టి దేవి పాదాల ముందున్న కుంకుమ తెచ్చి మంజుల నుదుట వుంచేడు.

"ఏమిటిది రాజూ?" అంటూ తుడిచివేయబోయింది. రాజశేఖరం వెంటనే ఆమె చెయ్యి పట్టుకొని ఆపేడు. "దేవి పాదాల ముందరి పూజ కుంకుమ నీ నుదుట వుంచి నీ చేయి పట్టుకున్నాను. నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నా. నన్ను కాదనకు మంజూ!" అన్నాడు రాజశేఖరం ఆవేశంగా.

"నీకు మతిపోయినట్లుంది రాజూ!" అంటూ రాజశేఖరం చేతిలో తన చేయి విడిపించుకొని రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకుంది. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"లేదు మంజూ! నేను నిన్ను ఎప్పటినుంచో ప్రేమిస్తున్నాను. పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఆ విషయం బైటపెట్టలేకపోయాను. నీకు ఇష్టం లేకుంటే చెప్పు మంజూ, నిన్ను బలవంతం చెయ్యను. కాని ఆ దేవి ముందు చెప్తున్నా, నేను మరొకర్ని చేసుకోను. జీవితాంతం యిలానే బ్రహ్మచారిగా వుంటాను"

మంజుల చివాలున రాజశేఖరం కళ్లల్లోకి చూసింది. అతను నిజమే చెప్తున్నాడని గ్రహించింది. "నేను వాడిపోయిన పుష్పాన్ని రాజూ! నన్ను చేసుకొని ఏం సుఖపడతావు" అంది మంజుల జీరపోయిన గొంతుకతో.

"కొన్ని పువ్వులు వాడినా వాటి సుగంధం నశించదు నాక్కావల్సింది వన్నర్థం

చేసుకొనే వ్యక్తి" "రాజా!" అంటూ అతని హృదయం మీద వాలిపోయింది మంజుల. రాజశేఖరం ఆమె నుదుటిని చుంబించేడు. వారిద్దరూ ఎదురుగా వున్న దేవికి నమస్కరించేరు.

ఎండ వేడికి రోజా ముఖం బాగా కందిపోయింది. రామంతో సమంగా నడవలేకపోతోంది. "అమ్మో!" అన్న రోజా గొంతుక విని వెనుతిరిగి చూసేడు రామం. రోజా కుడికాలు ఏంకిల్ పట్టుకొని కూర్చుంది. "ఏమైంది" ఆతృతగా అడిగేడు. "కాలు స్లిప్ అయి బెణికింది" లేచి రెండడుగులు వేసి మళ్ళీ కూర్చుండిపోయింది. రోజా వారిస్తున్నా వినకుండా ఆమె ఏంకిల్ రబ్ చేసేడు రామం.

"చాలా దగ్గరకు వచ్చేసేం ఇంకెతో దూరం లేదు. ఆ మలుపు తిరిగితే భైరవి ఆలయం!" అన్నాడు. రోజా లేచి మరి రెండడుగులు వేసి మళ్ళీ కూర్చుండిపోయింది. ఇక చేసేదిలేక ఆమెను రెండు చేతులతో పైకెత్తి నడక సాగించేడు. ఆమె ఎంత వారిస్తున్నా వినకుండా. భైరవి ఆలయం కనిపించగానే అతని చేతుల్లోంచి జారి ముందుకి పరుగులంకించుకుంది.

రామం క్షణకాలం నిర్ఘాంతపోయేడు. ఆమెను పట్టుకొని బుద్ధి చెప్పాలని తను కూడా ఆమె వెంట పరిగెత్తాడు. కాని ఆమెను అందుకోలేకపోయేడు. రోజా పరుగు పరుగున వెళ్ళి రాజశేఖరం వెనుక చేరింది. రామం ఉస్సురంటూ వెళ్ళి మండపంలో కూర్చున్నాడు.

"ఏం జరిగింది?" అన్నాడు రాజశేఖరం చిరునవ్వుతో వారిద్దర్నీ చూస్తూ. "ఆఁ! ఏం వుంటుంది. మీ రోజా మా అన్నయ్యను మూడు చెరువుల నీళ్లు త్రాగించి వుంటుంది" అంది మంజుల.

'నేనేం త్రాగించలేదండోయ్! ఆయనగార్కి దాహం వేస్తే తాగేరేమో! పాపం ఎండ ఎక్కువగా వుంది కదా!" అంది రోజా నవ్వు ఆపుకుంటూ.

"భోజనానికి రండి" అంటూ కేరియర్ను విప్పింది మంజుల. సాయంత్రం వరకూ వారు సరదాగా కాలక్షేపం చేసి ఇంటి ముఖం పట్టేరు. వారు ఇంటికి చేరేసరికి రాజశేఖరానికి ఓ టెలిగ్రాం, ఒక కవరు తెచ్చి యిచ్చింది నాగి.

మర్నాడుదయం ట్రైన్‌లో తాము అక్కడికి చేరుతున్నట్లు స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకోమని ముకుందరావుగారు పంపిన మెసేజి అది. రాజశేఖరం టెలిగ్రాం చదివి రోజాకి యిచ్చేడు. మేసేజి చదివిన రోజా బుగ్గలు ఎరుపెక్కేయి. గబగబ మేడ మీదకు వెళ్ళిపోయింది. రాజశేఖరం ఉత్తరం చదివేడు.

"బావా!

ఆరోజు అమ్మ కోపంలో నిన్ను ఏమో అంది. దాన్ని నువ్వు యింత సీరియస్‌గా తీసుకుంటావనుకోలేదు. నేను నీతో మనస్సు విప్పి మాట్లాడుదామని వస్తే నువ్వు చిరాకుతో నాకా అవకాశం యివ్వలేదు. రెండు మూడు రోజుల్లో నువ్వు తప్పక వస్తావని నీకోసం ఎదురు చూసేను. కాని రాలేదు. ఈమధ్య మీ షికార్లు, వినోదాలు మళ్ళీ అమ్మ చెవిని పడ్డాయి. దాంతో అమ్మ మరీ బిగుసుకుపోయింది. పై సంబంధాలు తీవ్రంగా

చూస్తున్నారు. ముగ్గురు అప్పుడే వచ్చి చూసి వెళ్ళేరు. నేను ఎంత ప్రతిఘటించినా లాభం లేకుండా వుంది. నేను నీ సొత్తు. నీ సొత్తు పరాధీనం అవకుండా చూసుకుంటావని అనుకుంటున్నా.

నీ పద్మ"

ఉత్తరం రాజశేఖరం మనస్సు పూర్తిగా పాడుచేసింది. స్నానం చేసి రామం యింటికి వెళ్ళేడు. "ఏవిటిది రాజా! చెల్లాయి చెప్పింది నిజమే? నువ్వు చెల్లాయిని చేసుకుంటానన్నావా? అందుకోసం పద్మను నిరాకరించేవా!" అన్నాడు రామం ఆశ్చర్యంగా.

"అవును రామం! మంజుల కూడ అంగీకరించింది. ఈ విషయం నీతో చెప్పాలనే వచ్చేను"

"రాజా!" అంటూ మిత్రుడ్ని కౌగలించుకున్నాడు చెమ్మగిల్లిన కళ్ళతో. "చెల్లాయి నిజంగా అదృష్టవంతురాలు" అన్నాడు. గుమ్మంలో నిలబడి వారి మాటలు విన్న మంజుల సిగ్గుతో తలవంచుకుంది.

'మరి మీ లవ్ ఎఫేర్ ఎంత వరకూ వచ్చింది రోజా ఏవంటుంది?" అన్నాడు రాజశేఖరం నవ్వుతూ. "ఆ అమ్మాయిని చేసుకుంటే మా అన్నయ్యా పని సరి! ముప్పతిప్పలూ పెడుతుంది" అంది మంజుల నవ్వుతూ.

ముకుందరావుగారు మర్నాడుదయం వస్తున్నట్లు చెప్పేడు రాజశేఖరం. మర్నాడుదయం రాజశేఖరం, రోజా కారులో స్టేషన్‌కి వెళ్ళి ముకుందరావుగార్ని, సుమిత్రగార్ని రిసీవ్ చేసుకున్నారు.

"ఏం అమ్మా! ఎలాగుంది విలేజ్ లైఫ్" అన్నారు ముకుందరావుగారు దార్లో. "చాలా బావుంది డాడీ! టైమ్ పాసవదన్నారు కాని యిట్టే గడిచిపోయాయి ఇరవై రోజులు" అంటూ రాజశేఖరం తోట, పొలాలు, భైరవి కొండ పిక్‌నిక్ గురించి తల్లిదండ్రులకి గొప్పగా చెప్పింది.

"అసలు పాయింటు చెప్పలేదేం!" అన్నాడు రాజశేఖరం చిరునవ్వుతో. "ఏయ్!" అంటూ రాజశేఖరాన్ని చేత్తో పొడిచింది రోజా. అందరూ ఫకాల్న నవ్వేరు. కారు యింటి ముందు ఆగేసరికి నాగి చంద్రయ్య వచ్చేరు "దండాలండి" అంటూ.

"మమ్మీ ఈ అమ్మాయి నాగి. ఈ చంద్రయ్య తమ్ముడి కూతురు చీమ్మిరపకాయ! ఇక్కడ మేనేజిమెంటంతా ఈ అమ్మాయే" అంటూ నాగిని తల్లికి పరిచయం చేసింది. చంద్రయ్య, నాగి వారి సామాన్లు వారికోసం ఏర్పాటు చేసిన గదుల్లో వుంచేరు.

పల్లెటూర్లో అంత పెద్ద యిల్లు అన్ని సదుపాయాల్తో వుండడం చూసి ఆశ్చర్యపోయారు ముకుందరావుగారు, సుమిత్రగారు. రాజశేఖరం యిల్లంతా చూసేక, "అమ్మాయి సరదాపడి వచ్చింది కాని ఇక్కడ ఏం యిబ్బంది పడుతోందోనని భయపడ్డాను" అన్నారు సుమిత్రగారు.

స్నానాలు, కాఫీ టిఫెన్సు అయిన తరువాత అందరూ డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు. "కమాన్ రామం! నా బెస్ట్ ఫ్రెండ్, వీరు ముకుందరావుగారు. రోజా ఫాదర్

వీరు సుమిత్రగారు, రోజా మదర్" అంటూ అప్పుడే వచ్చిన రామాన్ని వారికి పరిచయం చేసేడు.

రామం ముకుందరావుగారితో కరచాలనం చేసి సుమిత్రగార్కి వినయంగా నమస్కరించేడు. "మావాడు బి.యస్.సి. ఎగ్రికల్చర్ యూనివర్సిటీ ఫస్టు" అన్నాడు రాజశేఖరం తన మిత్రుడ్ని ప్రశంసిస్తూ. "ఇప్పుడేం చేస్తున్నారు? ఫర్దర్ స్టడీస్ కన్టిన్యూ చెయ్యలేదేం!" అన్నారు ముకుందరావుగారు.

"ప్రాక్టికల్ ట్రైనింగ్ అవుతున్నారు డాడీ!" అంది రోజా కొంటెగా. "ఓ బస్తీ అమ్మాయి దగ్గర!" అన్నాడు రాజశేఖరం. అందరూ గొల్లున నవ్వేరు.

రామం కొంచెంసేపు కూర్చుని వారితో మాట్లాడి "మళ్లీ వస్తానని" చెప్పి వెళ్లిపోయేడు. "కుర్రాడు చురుకైన వాడిలానే వున్నాడు" అన్నారు ముకుందరావుగారు.

రాజశేఖరం వారికి రామం విద్యాబుద్ధులు, వినయ విధేయతలు, ఆస్తిపాస్తుల గురించి వివరాలన్నీ చెప్పి "రోజాకు అన్ని విధాల తగిన సంబంధం! రోజా సెలక్షను అమోఘం పైగా యిద్దరూ యిష్టపడ్డారు" అన్నాడు.

"ఆ విషయాలన్నీ అమ్మాయి చెప్పిందిలే, మరి నీ సంగతి ఏమిటి రాజూ!" అన్నారు సుమిత్రగారు నవ్వుతూ. "కోడల్ని చూడ్డానికి తొందర పడుతోందోయ్! మీ పిన్ని" అన్నారు ముకుందరావుగారు చిరునవ్వుతో. "సాయంత్రం తప్పకుండా చూపిస్తాను" అన్నాడు రాజశేఖరం. "వాట్ రాజా! నాతో యిన్నాళ్లూ చెప్పలేదేం!" అంది రోజా బుంగమూతి పెట్టి. "నువ్వు మాత్రం చెప్పేవేంటి" అన్నాడు రాజశేఖరం కొంటెగా.

సాయంత్రం రామం వాళ్ళింటికి బయల్దేరేరు ముకుందరావుగారు, సుమిత్రగారు, రాజశేఖరంతో. విషయం తెల్సు కనుక రోజా రానంది సిగ్గుతో. మంజుల రామం వార్ని సగౌరవంగా రిసీవ్ చేసుకొన్నారు.

ముకుందరావుగారు అసలు విషయం ప్రస్తావించేరు. "రాజా కన్న మా శ్రేయోభిలాషి మరెవ్వరూ లేరు. అతను ఎలా చెప్తే అలానే నడుచుకుంటాం" అన్నాడు రామం.

"వచ్చే నెల్లో మంచి ముహూర్తాలున్నాయిట మేం హైదరాబాద్ వెళ్ళి డేటు ఫిక్స్ చేసి రాస్తాం" అన్నారు ముకుందరావుగారు. రామం సరేనన్నాడు.

"రాజా మేం వచ్చిన పని సవ్యంగా పూర్తయింది. మరి మా కోడల్ని చూపిస్తానన్నావు వెళ్దామా" అన్నారు సుమిత్రగారు చిరునవ్వుతో.

"చూసేరుగా! మీ ప్రక్కనే కూర్చుంది" మంజుల సిగ్గుతో తల వంచుకుంది.

"ఎవరూ మంజులా!? పుత్తడి బొమ్మలా వుంది. చాలా బాగుంది నీ సెలక్షన్"

"మరింకేం రెండు పెళ్ళిళ్లూ ఒకే ముహూర్తంలో చేసేద్దాం" అన్నారు ముకుందరావుగారు. "మాకు ఈ ఆర్భాటాలు అవి నచ్చవండీ! అంచేత మేం రిజిస్ట్రీ మేరేజ్ చేసుకుందామనుకుంటున్నాం" అన్నాడు రాజశేఖరం.

"మీరు మరోలా అనుకోకపోతే మాది కూడా అలానే జరిపిస్తే బావుంటుంది" అన్నాడు రామం. ముకుందరావుగార్కి, సుమిత్రగార్కి రామం చేసిన ప్రొపోజల్ నచ్చింది.

## 4

అనుకున్నట్లే మరో పదిహేను రోజుల్లో మంజుల రాజశేఖరం, రామం రోజాల వివాహం జరిగిపోయింది. రాత్రి డిన్నర్లో రాజశేఖరం మంజులను తమ కొడుకూ కోడలూ అని, రోజా రామంలను తమ కూతురు అల్లుడూ అని అతిథులకు పరిచయం చేసేరు సుమిత్రగారు, ముకుందరావుగారు.

రాజశేఖరం ఎం.ఏ. ఫస్ట్‌క్లాసులో పాస్ అయినట్లు తెల్సి అంతా ఎంతో సంతోషించేరు. 'మా కోడలు అదృష్టవంతురాలు' అంటూ మురిసిపోయేరు సుమిత్రగారు.

రామానికి ఫారిన్ స్కాలర్‌షిప్ వచ్చింది ఫర్దర్ స్టడీస్‌కి. ఈ అవకాశం వదులుకోవద్దని రాజశేఖరం ముకుందరావుగారు ఎంతో నచ్చచెప్పి ఒప్పించేరు రామాన్ని. కూతురు అల్లుడితో ముకుందరావుగారు సుమిత్రగారు కూడా ఫారిన్ వెళ్ళి కొన్నాళ్ళుండి వస్తామని అన్నారు. రాజశేఖరం, మంజుల వారికి విమానాశ్రయంలో వీడ్కోలు చెప్పేరు.

రాజశేఖరం మంజుల డార్జిలింగ్ హనీమూన్‌కి వెళ్ళేరు. తిరిగి వస్తున్నప్పుడు కలకత్తాలో దిగేరు. మంజులకు హౌరా బ్రిడ్జి, బిర్లా ప్లానిటేరియమ్, మ్యూజియం, జూ, దక్షిణేశ్వర్, కాళీఘాట్ చూపించేడు రాజశేఖరం.

బేలూర్‌మఠ్‌లో వారికి మంజుల బావ మధు కనిపించి పల్కరించేడు. మధు కాలేజీలో చదువుతూ యింట్లోంచి చెప్పకుండా పారిపోయేడు. సుమారు పది సంవత్సరాల తరువాత మంజుల అతడ్ని చూడ్డం యిదే. రాజశేఖరం మధూని ఆపాదమస్తకం ఒకమారు చూసేడు. మధు చాలా ఖరీదైన సూటు వేసుకున్నాడు. అతన్ని ఒకటి రెండు పర్యాయాలు చూసినట్లు గుర్తు రాజశేఖరానికి తన చిన్నతనంలో.

వారి కలయికకు మధు చాలా సంతోషించేడు. వారు ఎంత వారిస్తున్నా వినకుండా వార్ని తన కారులో దగ్గర వున్న హెూటల్‌కి తీసుకెళ్లి కాఫీ టిఫెన్ యిప్పించేడు. తను కలకత్తాలో నైట్ కాలేజీలో చదివి యింజనీరింగ్ పూర్తి చేసేనని ప్రస్తుతం సెల్ఫ్ ఎంప్లాయిమెంటు స్కీమ్‌లో వర్క్‌షాపు పెట్టేనని, మర్నాడు వార్ని తన యింటికి వచ్చి ఓ రెండు రోజులుండమని తన విజిటింగ్ కార్డు యిచ్చేడు. వర్కుషాపు పై భాగంలో తను వుంటున్నానని ఆ బిల్డింగ్ తనే కట్టించేనని చెప్పేడు. మర్నాడుదయం ఎనిమిది గంటలకు తనే స్వయంగా వచ్చి వార్ని తన యింటికి తీసుకెళ్తాను రడీగా వుండమని చెప్పేడు.

మంజుల రాజశేఖరం అతని మాట కొట్టివేయలేక సరేనన్నారు. రాజశేఖరం మంజుల మర్నాడుదయం అతని కోసం చాలాసేపు వెయిట్ చేసేరు. కాని అతను రాలేదు. అతను వచ్చేలోపల నేనొకమారు హౌరా స్టేషన్‌కి వెళ్లి మన రిజర్వేషన్స్ సంగతి చూసొస్తానని రాజశేఖరం బయల్దేరేడు.

రాజశేఖరం హౌరా స్టేషన్ నుండి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం పన్నెండయింది. హెూటల్ మేనేజరు రూం తాళం తెచ్చి యిచ్చేడు అమ్మగారు బయటకు వెళ్లేరని చెప్తూ.

బహుశా మధూ వాళ్లింటికి వెళ్ళి వుంటుందనుకుంటూ రూమ్ తలుపు తెరిచి

డ్రెస్సింగ్ టేబిల్ మీద వున్న చీటీ తీసి చదివేడు.

"రాజూ!

మీరు బయటకు వెళ్ళిన మరో పది నిమిషాల్లో బావ అతని శ్రీమతి వచ్చేరు. దార్లో కారు ట్రబులివ్వడంవల్ల లేటయిందని ఎంతో నొచ్చుకున్నారు. మీరు రాగానే బావ వాళ్ళింటికి ఫోన్ చేస్తే కారు పంపిస్తానన్నాడు. లేకుంటే మీరు టాక్సీలో వచ్చేయండి. సాయంత్రం తిరిగి వచ్చేద్దాం. బావ విజిటింగు కార్డు ఇక్కడ వుంది.

మీ మంజుల"

రాజశేఖరం మధూ వాళ్ళింటికి ఫోన్ చేసేడు. ఎన్నిమార్లు ప్రయత్నించినా ఎంగేజి సౌండు వస్తోంది. ఇంక లాభం లేదని స్నానం చేసి బట్టలు మార్చుకొని మధు వాళ్లింటికి బయల్దేరేడు. మధు ఇచ్చిన ఎడ్రస్ ప్రకారం వర్కుషాపులో అడిగితే అక్కడ ఆ పేరుగలవారు ఎవరూ లేరని తెల్సింది. అందులో పనిచేస్తున్న వారంతా ఓనరుతోసహా బెంగాలీలే. ఓనరు గురించి అడిగితే అతను ఇప్పుడే భోజనానికి వెళ్ళేడని వర్కుషాపు పైభాగంలోనే వుంటున్నాడని తెల్సింది. రాజశేఖరం నేరుగా వెళ్ళి ఓనర్ని కల్సుకుని విజిటింగ్ కార్డు చూపించి సంగతంతా చెప్పేడు.

అతను రాజశేఖరం చెప్పిందంతా విని చాలా ఆశ్చర్యపోయాడు. "ఇదేదో బోగస్ కార్డులా వుంది! ఫోన్ నెంబరు కూడా ఈ జోన్‌ది కాదు! మీరు వెంటనే పోలీసు రిపోర్టు యివ్వడం మంచిది" అని సలహా యిచ్చేడు. రాజశేఖరం తొందరపడలేదు. చుట్టుప్రక్కల వున్న వీధులన్నీ తిరిగి చూసేడు. కాని లాభం లేకపోయింది. ఆ ప్రాంతాల్లో మరొక వర్కుషాపు లేదు.

ఎండలో తిరగడం వల్ల విపరీతమైన తలనొప్పి వచ్చింది. ఇంక చేసేది లేక హోటల్ రూంకి వచ్చి భోజనం చేసి తలనొప్పి మాత్ర వేసుకొని పడుకున్నాడు. ఆ పడుక్కోవడం సాయంత్రం 5 గంటలకు కాని మెలకువ రాలేదు. "మంజుల ఏమై వుంటుందని?" చిన్న బెంగ బయలుదేరింది. హోటల్ మేనేజరుకి జరిగిందంతా చెప్పేడు.

అతను జరిగిందంతా విని ఎంతో ఆశ్చర్యపోయాడు. ఇంక వుపేక్షిస్తే లాభం లేదని పోలీసు రిపోర్టు యిచ్చేడు రాజశేఖరం.

ఆ రాత్రి బాగా పొద్దుపోయేవరకూ చాలాచోట్ల వెదికేడు లాభం లేకపోయింది. మర్నాడుదయం పోలీసు స్టేషన్‌కి వెళ్ళి అడిగేడు. ఇంకా ఆచూకీ దొరకలేదన్నారు. అన్ని దినపత్రికల్లోను ఫోటోతోసహా ప్రకటనలు వేయించేడు.

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. కాని మంజుల సంగతేం తెలియలేదు. గత వారం రోజుల్లో రాజశేఖరం మానసికంగా ఎంతో కృశించిపోయేడు. గెడ్డం బాగా మాసిపోయింది. కళ్లు, గుంటలు పడ్డాయి. ఇంక అక్కడ వుండి చేసేదేం లేదని మంజుల సమాచారం ఏమైనా తెలిస్తే తనకు వైర్ చెయ్యమని హోటల్ మేనేజరుకి చెప్పి స్వగ్రామం తిరిగి వచ్చేడు.

రాజశేఖరానికి ముప్పొద్దులా ఒకే విచారం పట్టుకుంది. రామానికి తను ఏం సమాధానం చెప్పాలి. వారానికో ఉత్తరం రాయమని మంజులకు మరీ మరీ చెప్పి వెళ్ళేడే!

మంజుల వద్ద నుండి ఉత్తరాలు రాకుంటే వూరుకుంటాడా? తను ఎన్నాళ్లు మభ్యపెట్టగలడు.

వూర్లో తెలిసిన వాళ్ళంతా వచ్చి సానుభూతి కనపరుస్తూ రాజశేఖరాన్ని ఎన్నో విధాల వోదార్చుతున్నారు. వార్త తెలియగానే శేషమ్మగారు వచ్చేరు.

"ఎంతపని జరిగిందిరా! రాజా! ఆ మంజుల ఎంతకు తెగించిందిరా? ఆ తలచెడ్డదాని వల్లో నువ్వెలా పడ్డావురా? ఆ దొంగపీనుగని నీకంటగట్టి ఆ దొరసానితో దేశం వదిలిపోయాడ్రా దానన్న! ఆ జగన్నాధంగాడు కొడుకూ కల్సి మీ కొంప నిలువునా కూల్చేర్రా! మీ సొమ్ము దోచేస్తూ వుంటే కానుకోలేకపోయారు. నేనూ మీ అమ్మ ఎంత మొత్తుకుని చెప్పినా విన్నారు కాదురా మీ తండ్రీ కొడుకులు.

"జగన్నాధంగాడు కొన్న పొలం, యిల్లు మీ సొమ్మేను. తడిగుడ్డతో నీ గొంతుక కోసి అదెవడితోనో చక్కాలేచి పోయింది. మన వంశంలో వున్నాయిరా యిటువంటి అప్రాచ్యపన్లు. గొర్రె గొల్లాడిని నమ్మదు కసాయివాడ్నే కాని. పోయింది పోతే పోయింది కాని మీ అమ్మ నగలన్నీ పట్టుకుపోయింది దొంగపీనుగ. నిక్షేపంలా నా కూతుర్ని చేసుకోమంటే కాదన్నావు!" శేషమ్మగారు తన అక్కసునంతా వెళ్లగ్రక్కేరు.

రాజశేఖరానికి మేనత్త మాటలు హృదయంలో ఒక్కొక్కటి శూలాల్లా గుచ్చుకున్నాయి. కోపంతో కంపించిపోయేడు. కాని వెంటనే తనను తాను సంబాళించుకుని ఏమో చెప్పబోయాడు.

"జరిగిందానికి నువ్వేం విచారపడకురా రాజా! మన శని విరగడై ందనుకో! మా తోటికోడలు కూతురు శారదను నువ్వు యిదివరకు చాలాసార్లు చూసేవు కదా. పద్మ యీడుదే. బంగారపు బొమ్మ! చిదిమి దీపం పెట్టొచ్చు! నువ్వు సరేనంటే...."

"అత్తయ్య ఇంక ఆపు! పెళ్ళి విషయం నా ముందు ప్రస్తావించకు" అన్నాడు కర్కశంగా. "పోతూ పోతూ అదేదో మందు పెట్టినట్లుందిరా నీకు. అయినవాళ్ళకు కాకుండా చేసింది. నీవాళ్ళ మాటలు నీకు రుచించడం లేదు. దబ్బపండులా వుండేవాడివి! ఎలా మాడిపోయావో అద్దంలో నీ ముఖం చూసుకోరా? నీ రూపమే నీకు తగిన సమాధానం చెపుతుంది" అన్నారు జీరపోయిన గొంతుకతో.

శేషమ్మగారు వారం రోజులుండి ఎన్నో విధాల రాజశేఖరానికి నచ్చచెప్పేరు. కాని రాజశేఖరం వినలేదు. చివరకు ఆవిడ విసిగి వెళ్లిపోయేరు.

ఊర్లో మంజుల గురించి రకరకాలైన పుకార్లు బయల్దేరేయి. ఆ వార్తలు చెవినపడి రాజశేఖరం మరింత కృంగిపోయేడు. అతను బయటకు వెళ్తే ఎక్కడ చూసినా గుసగుసలే. ఆ కారణంగా కొన్నాళ్లు బయటకు వెళ్లడం కూడ మానుకున్నాడు. కాని ఎన్నాళ్లు ఇంట్లో కూర్చోగలడు. ఏదో వ్యాపకం లేకుంటే పిచ్చి ఎత్తుతుందేమో అనుకున్నాడు.

చంద్రయ్య, వీరయ్య ఎంత వారిస్తున్నా వినకుండా యిద్దరికీ చెరో 5 ఎకరాల పొలం రాసేడు. మిగిలిన పొలం, తోట, యిల్లు అమ్మివేసేడు. నాగికి మంచి సంబంధం చూసి చెయ్యమని పెళ్ళి ఖర్చుల కింద మూడువేల రూపాయలు వీరయ్యకు యిచ్చేడు.

హైదరాబాద్‌కు పదిమైళ్ళ దూరంలో ఓ పదిహేను ఎకరాల స్థలం కొని "అనాధ

స్త్రీ శరణాలయం" నిర్మించేడు. అందులో అనాథలైన స్త్రీలకు స్వయం పోషకత్వానికి పనికి వచ్చే వృత్తులు నేర్పేటట్లు ఏర్పాటు చేసేడు. కుట్టుపన్లు, అల్లికలూ, ప్లాస్టిక్ సంచులు, బుట్టలు అల్లడం, కూరగాయ మొక్కలు పెంచడం మొదలైన వెన్నో ప్రవేశపెట్టేడు. వారుండడానికి వసతి భోజన సదుపాయాలు కల్గించేడు.

ప్రతి ఒక్కరి పనిని బట్టి వారి ఆదాయం లెక్కకట్టి వారి ఖర్చులు పోనుమిగిలింది నెలకో మారు వారికిచ్చేటట్లు చేసేడు. శరణాలయం పని ప్రారంభించగానే చంద్రయ్య, వీరయ్య రాజశేఖరం ఎక్కడ వుంటే తామూ అక్కడే వుంటామని వచ్చి అతని పనిలో చేదోడుగా నిల్చేరు. కూరగాయల మొక్కల పెంపకం, అమ్మకం మొదలైన బాధ్యతలు తాము తీసుకున్నారు.

పదిమందితో ప్రారంభమైన శరణాలయంలో ఐదు నెలల్లో అరవందమందయ్యారు. హైదరాబాద్‌లో కొన్ని సంస్థలు ముందుకు వచ్చి రాజశేఖరం కృషిని ఎంతో మెచ్చుకొన్నాయి. వారు వారంవారం శరణాలయానికి వచ్చి అక్కడ తయారైన వివిధ వస్తువులను సరసమైన ధరలు చెల్లించి తీసుకొని పోతున్నారు.

నాగికి మంచి సంబంధం చూసి చేసేరు. నాగి భర్త సుందర్రావు ఇంటరు వరకూ చదువుకున్నాడు. అందుచేత శరణాలయ వ్యవహారాల్లో తనకు సహాయం చేస్తాడని అతడ్ని, నాగిని అక్కడే వుండమన్నాడు రాజశేఖరం.

## 5

రెండు సంవత్సరాల కాలం దొర్లిపోయింది. ఒకరోజు ఉదయం హైదరాబాద్ లేడీస్ క్లబ్ ప్రెసిడెంటు డాక్టర్ ప్రసూనాంబగారు, వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి సరోజాక్షిగారు, సెక్రటరీ సావిత్రిగారు శరణాలయం చూడ్డానికొచ్చేరు. రాజశేఖరం వారికి శరణాలయమంతా చూపించి అన్నీ వివరంగా చెప్పేడు.

సుమారు అరవందమంది అనాథ స్త్రీలను చేరదీసి వారికి జీవనోపాధి కల్పించి, వారి జీవితాల్లో వెలుగు ప్రసాదించిన రాజశేఖరాన్ని ఎన్నో విధాల కొనియాడేరు డాక్టర్ ప్రసూనాంబగారు. తను వారంకోమారు శరణాలయానికి వచ్చి తన వృత్తిరీత్యా అవసరమైన సహాయం ఉచితంగా చేస్తానని హామీ యిచ్చేరు.

మర్నాడు తమ క్లబ్ వార్షికోత్సవమని, ఆ సందర్భంలో శరణాలయానికి రెండు కుట్టుమిషన్లు తమ క్లబ్ తరపున బహూకరించదల్చుకున్నామని, రాజశేఖరాన్ని వచ్చి వాటిని స్వీకరించమని కోరేరు. రాజశేఖరానికి ఈ సభలూ, సమావేశాలూ, సన్మానాలు నచ్చకపోయినా వారి మాట కాదనలేక అంగీకరించి వెళ్ళేడు.

డాక్టరు ప్రసూనాంబగారు, రాజశేఖరాన్ని వేదిక మీదకు రప్పించి అతన్ని తమ సభ్యులకు పరిచయం చేసి అతను చేస్తున్న సేవ గురించి ఘనంగా చెప్పేరు. తమ క్లబ్ తరపున రెండు కుట్టుమిషన్లు శరణాలయానికి బహూకరించినట్లు చెప్పి వాటిని రాజశేఖరానికి అందించేరు. రాజశేఖరాన్ని, అతని శరణాలయాన్ని గురించి ఏమైనా మాట్లాడమని కోరేరు.

ఏ సాధన సంపత్తీ లేని తనలాంటి వాళ్లు ఒంటరిగా చేసిందీ, చేయగల్గిందీ ఏం లేదని, ఉన్నా అది చాలా కొంచమేనని అన్నాడు. సంఘంలో, అంగబలం, ఆర్థికబలం వున్న ఇటువంటి లేడీస్ క్లబ్ వారు శరణాలయాలు నిర్మించడం చాలా తేలికని చెప్పేడు. శరణాలయంలో ఆశ్రయం కోరేవారు మొదటి కొద్దిరోజులూ శరణాలయానికి కొద్దిగా భారమైనా తరువాత వారు స్వయం పోషకులవుతారని, అందుచేత మీకున్న పలుకుబడి, హెూదా, ఆర్థిక బలంతో ఎన్నో మంచి పనులు చెయ్యొచ్చని ఏ అండా లేని సాటి, తోటి స్త్రీలకు ఏదో విధంగా చేయూత నివ్వమని సలహా యిచ్చేడు రాజశేఖరం.

రాజశేఖరం వేదిక దిగుతూంటే "బావా!" అంటూ అతని దగ్గరకు వచ్చింది పద్మ.

"ఏమిటీ వేషం బావా! ఆ గెడ్డం, గిరజాలూ, కళ్ళజోడూ నిన్నసలు పోల్చుకోలేక పోయానంటే నమ్ము! నువ్వు శరణాలయం పెట్టేవా? మావారికి ఈ వూళ్లోనే ఉద్యోగం! బయట కారు దగ్గర వున్నారు పద నిన్నువారికి ఇంట్రడ్యూస్ చేస్తాను" అంటూ రాజశేఖరాన్ని బలవంతంగా తనతో బయటకు తీసుకెళ్లి తన భర్త చలపతిరావుకు ఇంట్రడ్యూస్ చేసింది.

చలపతిరావు, రాజశేఖరాన్ని ఒకమారు ఆపాదమస్తకం చూసి ముఖం చిట్లించేడు. "ఇటువంటి ఫెలోస్‌కి ఎప్పుడూ దూరంగా వుండమని నీకెన్ని పర్యాయాలు చెప్పేను. కమాన్‌లెటజ్‌గో" అంటూ భార్య చెయ్యి పుచ్చుకొని గబగబా కారు వేపు నడిపించుకుపోయేడు చలపతిరావు.

"ఏం జరిగిందండీ!" అంటూ డాక్టర్ ప్రసూనాంబగారు ఆత్రుతతో అడిగేరు రాజశేఖరాన్ని సమీపించి. "అబ్బే ఏం లేదండీ!" అన్నాడు రాజశేఖరం చిరునవ్వు నవ్వుతూ.

## 6

మరో ఐదు సంవత్సరాల కాలం కాలగర్భంలో కల్సిపోయింది.

ఒకరోజు ఉదయం తెలతెల వారుతుండగా ఒక కారు వచ్చి శరణాలయం గేటు ముందు ఆగింది. అందులో నుంచి ఇద్దరు స్త్రీలు దిగి శరణాలయంలోకి రావడం ఆఫీసు గది ముందు నిల్చున్న సుందర్రావు ఆశ్చర్యంగా చూసేడు. వారిరువురూ నేరుగా సుందర్రావు దగ్గరకే వెళ్ళేరు.

"చూడు బాబూ! ఇక్కడ రాజశేఖరం ఉన్నారా?" అని ఆ యిరువుర్లో కాస్త వయస్సు పైబడ్డ ఆవిడ అడిగింది. "మేడ మీద వున్నారండి! యిలా వచ్చి ఆఫీసులో కూర్చోండి. వారు మరో అరగంటలో క్రిందికి వస్తారు" అన్నాడు సుందర్రావు.

బయట గేటు దగ్గర ఆగిన కారెవరిదా అని అటుగా వస్తున్న నాగి గేటు దగ్గరకు వెళ్ళి చూసింది. "రాంబాబుగోరా!?" అంది ఆశ్చర్యంగా కారు దగ్గర నిల్చున్న రామాన్ని చూసి. "ఎవరూ నాగీ!" అన్నాడు రామం. "రండి బాబూ! ఆడే నిల్చున్నారేం?" "రాజా వున్నాడా? ఇప్పుడే రోజా వాళ్లు లోపలికి వెళ్ళేరు చూసొస్తామని" అన్నాడు. నాగి వెంట శరణాలయంలోకి వస్తూ. "దండాలండీ బుల్లెమ్మగోరూ, దండాలండి పెద్దమ్మగోరూ"

అంది నాగి రోజాను సుమిత్రగార్ని చూసి.

"ఏం నాగీ బావున్నావా?" అంటూ ఆప్యాయంగా పల్కరించేరు సుమిత్రగారు. "ఆరెవరనుకున్నారు. అలా బైట నిలేసేసినారు" అంది భర్తతో. "మా యజమానండీ" అంటూ అతన్ని వారికి పరిచయం చేసి "సినబాబు పైన వున్నారు రండి" అంటూ వార్ని తీసుకొని పైకి వెళ్ళింది.

సుందర్రావుకు వాళ్ళెవరో అర్థం కాక వాళ్లు వెళ్ళిన వేపు చూస్తూ నిల్చుండిపోయేడు. రాజశేఖరం మేడమీద తన గదిలో పచార్లు చేస్తున్నాడు. "సినబాబూ!" అన్న నాగి పిలుపు విని ఇటు తిరిగి చూసేడు.

ఎదురుగా నాగితో వస్తున్న రామం, రోజా, సుమిత్రగార్లను చూసి ఆశ్చర్యపోయాడు. వాళ్లు మొదట రాజశేఖరాన్ని చూసి పోల్చుకోలేకపోయారు, దట్టంగా పెరిగిన గెడ్డం, గిరజాల జుత్తు, దళసరి అద్దాల కళ్ళజోడు, షరాయి, లాల్చీ వేసుకొని వున్న అతన్ని చూసి.

"రాజూ!" అంటూ రామం, రాజశేఖరాన్ని కౌగిలించుకున్నాడు. "ఏం జరిగింది రాజూ! ఎందుకిలా అయిపోయేవు చెల్లాయి ఏది?" ప్రశ్నల వర్షం కురిపించేడు. "ఏం బాబూ! ఏం జరిగింది. ఈ వేషమేంటి? మేం ఎన్ని వుత్తరాలు రాసినా జవాబైనా యివ్వలేదేం?" అంటూ సుమిత్రగారు, రాజశేఖరాన్ని పట్టుకొని వెక్కివెక్కి ఏడ్చేరు.

రాజశేఖరం వారికి జరిగిందంతా చెప్పేడు. 'ఈవార్త మీకు చెప్పడానికే కాబోలు నేనింకా బ్రతికున్నాను" అన్నాడు బొంగురుపోయిన గొంతుకతో

రామం ఎన్నో విధాల వూరడించేడు రాజశేఖరాన్ని తను చదువుతూండగానే ముకుందరావుగారు గుండెపోటుతో ఫారిన్‌లోనే మరణించేరని, తను చదువు పూర్తిచేసి అక్కడే కొన్నాళ్లు ఉద్యోగం చేయవల్సి రావడం తరువాత హైదరాబాద్‌లో మంచి ఉద్యోగం రావడంతో వారంరోజుల క్రితమే తాము స్వదేశం తిరిగి రావడం, వచ్చిన తరువాత తమ వూరు వెళ్ళి వాకబు చేయగా రాజశేఖరం యిక్కడ వున్నట్లు తెల్సి యిటు రావడం సవిస్తరంగా చెప్పేడు.

నాగి కాఫీ తెచ్చి వారి ముగ్గురికీ ఇచ్చింది. "రాజాకో" అన్నారు సుమిత్రగారు. నాగి రాజశేఖరం వేపొకమారు చూసి తల దించుకుంది.

"ఇంద రాజూ! నువ్విది తీసుకో, నాగి నాకు మళ్ళీ తెస్తుంది" అంటూ తన కప్పు రాజశేఖరానికి అందించబోయేరు సుమిత్రగారు. రాజశేఖరం ఏమో చెప్పబోయేడు. "సినబాబు కాఫీ తాగరమ్మా మానీసేరు!" అంది నాగి మెల్లగా.

సుమిత్రగారు తన కప్పు ప్రక్క నుంచీసేరు. మరేం మాట్లాడకుండా అంతా ఆశ్చర్యంగా ఆవిడ వేపు క్షణకాలం చూసేరు. "శరణాలయం చూద్దురుగాని రండి" అని వారిని తీసుకెళ్ళి శరణాలయమంతా చూపించి వివరంగా చెప్పేడు.

రాజశేఖరంగారి తల్లి, చెల్లెలు, బావగారు వచ్చేరన్న వార్త శరణాలయ మంతా ప్రాకింది. శరణాలయంలో అందరూ వార్ని ఎంతో గౌరవించేరు. అంతమంది అనాధల్ని చేరదీసి వారికి ఆశ్రయమిచ్చిన రాజశేఖరాన్ని ఎంతో మెచ్చుకున్నారు సుమిత్రగారు.

"మీ బాబయ్యగారే బ్రతికుంటే నువ్వు చేస్తున్న పనికి ఎంత గర్వించేవారో" అన్నారు సుమిత్రగారు ఆనందబాష్పాలు రాలుస్తూ. మధ్యాహ్న భోజనం తమ నల్గురికీ మేడ మీదకే తీసుకురమ్మని నాగితో చెప్పేడు రాజశేఖరం.

రాజశేఖరం ప్లేటులోని పదార్థాలు చూసి అంతా ఆశ్చర్యపోయేరు. రెండు గోధుమ రొట్టెలు, ఒక కప్పు మజ్జిగ ఒక అరటి పండు వున్నాయి. "రోజా నీ భోజనం యిదేనన్నమాట!" అన్నాడు రామం. రాజశేఖరం పేలవంగా నవ్వేడు.

"అవును బాబూ రేతిరి అయీ తిన్రు" అంది నాగి బాధగా. "చూడు నాగీ నా ప్లేట్లో యివన్నీ తీసేయి. నాకు కూడా రాజాకు పెట్టినవేతే" అంటూ తన ప్లేటు ముందుకు జరిపేరు. "మమ్మీ!' అంది రోజా బాధగా. "అదికాదు రామం! నాకు ఇంకేం తీసుకున్నా అరగదు" అన్నాడు రాజశేఖరం సంజాయిషీగా.

"అవునయ్యా! నీకా వయస్సులో అరగంది నాకీ వయస్సులో అరుగుతుందా?" అన్నారు. సుమిత్రగారు కోపంతో "తీసుకెళ్ళవేం!" అంటూ నాగిని హెచ్చరించేరు. నాగి అడుగు ముందుకు వేసింది. రాజశేఖరం ఆగమన్నట్లు సౌంజ్ఞ చేశాడు.

రాజశేఖరం ప్లేటులోని పదార్థాలు తీసి వేరే వుంచి తమ కోసం చేసిన పదార్థాలే అతనికీ వడ్డించేరు సుమిత్రగారు. రాజశేఖరం కిమ్మనకుండా వడ్డించిన వన్నీ తినీసేడు. "మమ్మీయే రాజాకు తగిన మందు" అంది రోజా భర్తతో. రామం చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. "మీ బాబయ్యగారు నాకో పెద్ద బాధ్యత అంటగట్టేరు బాబూ!" అన్నారు సుమిత్రగారు. రాజశేఖరం ప్రశ్నార్థకంగా ఆవిడవేపు చూసేడు. "మరేం లేదు ఆస్తి పంపకం విషయం. ఇల్లు అమ్మాయి పేర రాయించమన్నారు. బ్యాంకులో వున్న లక్ష రూపాయల్లో ఏభై వేలు నీకిమ్మన్నారు, మిగిలిన ఏభై వేలూ నాపేర వుంచమన్నారు..."

"నాకెందుకూ!?" అన్నాడు రాజశేఖరం ఆశ్చర్యంగా. "ఎందుకేవిటి! నువ్వు ఆయన అభిమాన పుత్రుడివి కనుక" అన్నాడు రామం. "వొద్దు! వొద్దు నేను తీసుకోను. నేనేం చేసుకోను?" అన్నాడు రాజశేఖరం.

"అలా అనకు బాబూ, వారి ఆత్మశాంతి కోసం వారు చెప్పినట్లు చెయ్యడం మంచిది" అన్నారు సుమిత్రగారు. "రాజా! డాడీ ఏమన్నారో తెల్సా! మన రాజా యిందులో ప్రతి పైసా సత్కార్యానికే వినియోగిస్తాడమ్మా! అన్నారు నన్ను పిల్చి" అంది రోజా చెమ్మగిల్లిన కళ్ళతో.

"వారికి ఎంత ముందు చూపుందో చూసేవా! బాబూ! వారు నిన్ను తల్చుకోని క్షణం ఉండేది కాదు! నీనుంచి ఉత్తరాలు రాలేదని ఎంత బాధపడ్డారో ఆ దైవానికే తెల్సు. ఇదుగో నా ఏభై వేలూ కూడా శరణాలయానికి రాస్తున్నా. వాటిని కూడ సద్వినియోగం చెయ్యి" అంటూ చెక్కురాసి రాజశేఖరానికి అందివ్వబోయేరు.

రాజశేఖరం అదిరిపడ్డాడు. చెక్కు తీసుకోలేదు. "తొందరపడకండి శరణాలయానికేం లోటులేదు...." అని రాజశేఖరం అంటే "లేదు బాబూ నేనేం తొందరపడలేదు! నిదానంగానే ఆలోచించి చేసిన పనే యిది. ఎందుచేత నంటే ఈరోజు నుండి నేను నీ దగ్గరే వుంటాను

కనుక" అన్నారు సుమిత్రగారు శాంతంగా.

"నా దగ్గరా! అంటే శరణాలయంలోనా? వీల్లేదు. నేను ఒప్పుకోను" అన్నాడు రాజశేఖరం ఆవేశంగా. "ఏం! ఎందుకు వీల్లేదు. ఇంతమందికి ఆశ్రయమిచ్చిన నీకు నేను బరువయ్యానా? నేను నీ కన్నతల్లినై వుంటే నన్నిలా బయటకు తరిమేస్తావా చెప్పు బాబూ!" అన్నారు వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

ఆవిడ అక్కడుంటే తగిన సదుపాయాలు సమకూర్చలేనేమో అన్న భయంతో రాజశేఖరం ఆవిడకు ఎన్నో విధాల నచ్చచెప్పేడు. కాని ఆవిడ వినలేదు. రాజశేఖరం మరి కాదనలేకపోయాడు.

సుమిత్రగారు కొన్నాళ్ళపాటు రాజశేఖరం దగ్గరే వుండడం మంచిదని, ఆమె అతడ్ని తప్పక దార్లోకి తీసుకొస్తుందని అనుకున్నారు రామం, రోజా. వారం వారం వస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

ఆ రాత్రి తన గదిలో చాప పర్చుకొని, మోచేయి తల క్రింద పెట్టుకొని, పడుక్కున్న సుమిత్రగార్ని చూడగానే రాజశేఖరం హృదయం కలుక్కుమంది. 'అమ్మా!" అంటూ ఆవిడ పాదాల మీద పడి చాలాసేపు దుఃఖించేడు.

మళ్ళీ వారం నాడు వచ్చిన రామం, రోజా రాజశేఖరంలోని మార్పు గమనించి ఆశ్చర్యపోయేరు. గెడ్డం, గిరజాలు, తీసివేసి అందంగా క్రాప్ చేయించుకున్నాడు. రోజూ షేవ్ చేసుకొంటున్నాడు. వచ్చినవారు కూర్చోడానికి మేడ మీద సోఫాలు, కుర్చీలు వేయించేడు. సీలింగ్ ఫేన్లు, మంచాలు, పరుపులు వున్నాయి. ఒక్క వారంలో అన్ని మార్పులు తీసుకురాగల్గిన సుమిత్రగార్ని ఎంతో మెచ్చుకున్నారు ఆవిడ కూతురు, అల్లుడు.

సుమిత్రగార్కి శరణాలయం వాతావరణం ఎంతో నచ్చింది. ఆవిడ కూడ మిగిలిన వారివలె కుట్లు, అల్లికలు, మొదలైన పన్లు చేస్తున్నారు. రాజశేఖరం ఆవిడను ఎన్నో పర్యాయాలు వారించేడు. కాని ఆవిడ వినలేదు. ఊరికే కూర్చునేకన్న నల్గురితో కల్సి పని చెయ్యడంలో వున్న సంతోషం నీకు చెప్తే అర్థంకాదు బాబూ!" అన్నారు.

మరో వసంతం గడిచింది.

ఒకరోజు రాత్రి రాజశేఖరం, సుమిత్రగారు భోజనానికి కూర్చున్నారు. నాగి వారి చెంతనే నిల్చుని వారికి కావల్సినవి అందిస్తోంది.

ఇంతలో సుందర్రావు పరుగు పరుగున వారిదగ్గరకు వచ్చేడు. "ఎవరో ఒకావిడ మీగురించి వచ్చేరు బాబూ! ఎవరు మీరు? వారితో మీకేంటి పని? అని నిలదీసి అడిగితే 'ఫిట్ వచ్చి పడిపోయారండీ. మనవాళ్ళంతా ఆవిడకు సేద దీరుస్తున్నారు" అన్నాడు.

రాజశేఖరం వెంటనే గబగబా క్రిందకు వెళ్ళేడు. అతని వెనుకనే సుమిత్రగారు, నాగి సుందర్రావు కూడ వెళ్ళేరు. వీరిని చూసి అక్కడ చేరినవారు ప్రక్కకు తప్పుకున్నారు.

"ఎవరో బాబూ! పాపం జ్వరం చాలా తీవ్రంగా వున్నట్లుంది. ఒళ్లు కాలిపోతోంది" అందొకావిడ. సుమిత్ర గారు చూసి "మంజులా!" అన్నారు.

రాజశేఖరం చూసేడు మంజులే. గుర్తు పట్టలేనట్లుంది ఆకారం. తైల సంస్కారం లేని జుట్టు, మాసికలు వేసిన చీర, జాకెట్టు, లోతుకుపోయి గుంటలు పడ్డ కళ్ళు, జ్వరతీవ్రతతో ఆమె ముఖం మరీ భయంకరంగా వుంది.

'మంజూ!" అంటూ బిగ్గరగా అరిచేడు రాజశేఖరం. "మరేం ఫర్వాలేదు రాజూ! జ్వరం కాస్త ఎక్కువగా వుందంతే. డాక్టర్‌కి కబురు చెయ్యి" అన్నారు సుమిత్రగారు.

సుందర్రావు డాక్టర్ కోసం వెళ్ళేడు. చుట్టూ చేరిన వారు ఆశ్చర్యంగా చూస్తున్నారు. మంజులను రాజశేఖరం, సుమిత్ర నాగి కల్సి మెల్లగా మేడ మీదకు తీసుకెళ్లి పడుకోబెట్టేరు. చల్లటి నీటిలో తడిపిన తడిగుడ్డ నుదుటమీద, తలమీద వుంచేరు.

మంజుల నెమ్మదిగా కళ్లు తెరిచింది. "మంజూ!" అంటూ ఆమె నుదుట మీద చెయ్యి వేసేడు రాజశేఖరం. "రాజూ!" అంది మంజుల అస్పష్టంగా. అమ్మా! మంజులా! ఎలా వుందమ్మా!" అన్నారు సుమిత్రగారు ఆతృతతో. మంజుల సుమిత్రగార్ని చూసి చేతులు జోడించింది.

"రాజూ! మోసపోయేను. మధూగాడు మనల్ని పూర్తిగా వంచించేడు. ఆ దుర్మార్గుడు నన్ను తీసుకెళ్లింది. వాడింటికి కాదు, నరకకూపంలోకి. ఆరోజు వాడి వెంట వచ్చింది వాడి భార్య కాదు, బజారు మనిషి! మనల్ని నమ్మించడానికి వెంట తీసుకొచ్చేడు.

"వారిద్దరూ నన్ను వూరు చివరనున్న చీకటింటిలో బంధించేరు. కనీసం మంచి నీళ్ళయినా యివ్వలేదు. ఆరోజు రాత్రి వారు నన్నూ, నాలాగే మోసగించి తెచ్చి బంధించిన మరో ఇద్దరమ్మాయిల్ని తీసుకొని కార్లో బయల్దేరేరు. కొండలు, గుట్టలూ, లోయల గుండా కొంతదూరం తీసుకెళ్లి మమ్మల్ని మరో కిరాతకుడికి అప్పగించి వాడి దగ్గర డబ్బు తీసుకొని వెళ్లిపోయేడు.

"ఆ కిరాతకుడు మమ్మల్ని చిన్న లాంచిలో పడేశాడు. లాంచిలో ఎంత దూరం ప్రయాణం చేసేమో తెలియదు కాని తెలతెలవారుతుండగా లాంచి బోల్తాపడింది. మేము నీళ్లలో పడి కొట్టుకుపోయేము.

"నాకు తెలివి వచ్చేసరికి నా చుట్టూ కొండజాతివారు మూగివున్నారు. వారిలో వృద్ధుడు నన్ను చూసి సంతోషంతో ఏమేమో అడిగేడు. కాని వాడి భాష కాని వాడేం అడుగుతున్నాడో నాకు అర్థం కాలేదు. నా కుడిచేతికి తలకు కట్లు కట్టబడి వున్నాయి. నీటిలో పడి కొట్టుకుపోతున్ననన్ను వారు రక్షించి వారి గూడేనికి చేర్చి నా గాయాలకు కట్లు కట్టేరనుకున్నాను.

"లేవబోయాను. వారు నన్ను సౌంజ్ఞ చేసి లేవొద్దని వారించేరు. తలకు, చేతికి తగిలిన గాయాలు చాలా బాధపెడుతూండడం వల్ల కదల్లేకపోయాను. నాతో కూడ నీటిలో పడిన ఆ యిద్దరమ్మాయిలు, ఆ కిరాతకుడి జాడలేదు. బహుశా వారు గంగాదేవి ఒడిలో చేరేరనుకున్నాను.

"వారు రోజూ ఆకులూ, మూలికలూ నూరి నా గాయాలకు కట్లుకట్టి నాకెంతో సంరక్షణ చేసేరు. నా గాయాలు పూర్తిగా మాని నేను లేచి తిరగ్గలిగే సరికి సుమారు

మూడునెలల పైనే అయింది. ఆ కోయగూడెంలోని వారందరూ నన్ను ఎంతో ఆదరంతోనూ గౌరవంతోనూ చూసేవారు. నేను అక్కడ వుండడం వల్ల వారెన్నో ఇబ్బందులకు గురయ్యేరు.

"గూడెంలో అందరూ వుదయాన్నే వేటకి పోయేవారు. సాయంత్రం తాము వేటాడి తెచ్చిన వాటిని అందరూ పంచుకొని తినేవారు. వారు నాకోసం అడివిలోంచి పండ్లు, కాయలు, దుంపలు, పట్టుతేనె తెచ్చేవారు. నేనక్కడ వున్నన్నాళ్లు నాకదే ఆహారం.

"ఆ కొండల్లో యీ కోయగూడెం తప్ప కనుచూపు మేర మరో పల్లెకాని, నరసంచారం కాని కానరాదు. ఎటు చూసినా ఎత్తైన కొండలు, దట్టమైన చెట్లు. నా దురదృష్టానికి చింతిస్తూ అక్కడే ఎంతో కాలం వెళ్ళదీసేను. ఒకరోజు ఆ ప్రాంతానికి ఒక ఫారెస్ట్ రేంజరు వచ్చేడు. అతనికి నా గురించి ఇంగ్లీషులో చెప్పేను. ఆ కోయవారు కూడా నా గురించి చెప్పేరు. అతను నాపై ఎంతో సానుభూతి చూపి నాకు సహాయం చెయ్యడానికి అంగీకరించి తనతో రమ్మన్నాడు.

"చేసేది లేక అతని వెంట వెళ్లేను. అక్కడికి సుమారు ఏభై మైళ్ల దూరంలో వున్న ఓ గ్రామంలో గల అతనింటికి నన్ను తీసుకెళ్ళేడు. అతని భార్య ఏమనుకుందో నన్ను చూసి నానా గొడవ చేసింది. నన్ను ఇంట్లోంచి బయటకు గెంటేసింది. ఆ గ్రామవాసులు ఎవరూ నన్ను చేరదీయలేదు.

"చేతిలో పైసాలేదు. కట్టుబట్టలు తప్ప మరేం లేదు. నా వొంటినున్న బంగారమంతా ఒలిచేసేడు ఆ మధూగాడు. ఎన్నో ఇబ్బందులు పడి ఎంతో కష్టం మీద మనూరుకు చేరేను. మీరు ఇక్కడ వున్నారని తెల్సి వచ్చేను. నా కట్టెలో ప్రాణం వుండగా మిమ్మల్ని మళ్లీ కలుస్తాననుకోలేదు.

"నా గురించి అయిన వాళ్ళందర్నీ కాదని నన్ను చేసుకున్నావు. నన్ను క్షమించు రాజా" అంటూ తన గాథ అతికష్టం మీద వెల్లడించి శేష జీవితం పురుషులతో స్త్రీల సమానత్వం కోసం పాటుపడాలని నిశ్చయించింది.

ప్రజామత, *1964.*